

నిజామాబాద్ జిల్లాలోని ఏర్గట్ల మండలంలో గల తడపాకల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాసిన కవిత్వాన్ని "పాదార్చన" పేరుతో కవితా సంకలనాన్ని ప్రచురించామని తెలుగు పండితులు ప్రవీణ్ శర్మగారు తెలిపారు. సాహిత్యంలో విద్యార్థులను ప్రోత్సహిస్తున్న పాఠశాల సిబ్బందికి అభినందనలు. ఈ కవితా సంకలనంలోని కవితలు ఈ వారం నేటినిజం పాఠకుల కోసం..




# బాల వికాసం



## నడిచే దైవాలు

నా చిరునవ్వుకు మారుపేరు అమ్మ
మనకు కష్టం వస్తే బాధ వస్తే
ఒక చిరునవ్వుతో నవ్వించేది
మనం ఏడిస్తే కన్నీళ్ళు తుడిచేది
ప్రేమతో అనురాగం పంచేది
మా అమ్మనే
మా అందాల బొమ్మనే
నాకు నడతను నేర్పి
నాకు బాటను చూపి
నా లక్ష్యానికి దారులు వెతికి
నా నిరంతర గమనానికి సేవకుడై
ముందుండే మా నాన్న నాకు దైవ స్వరూపమే

-ఎల్. లక్ష్మణ్
9వ తరగతి

## నాన్నే నా నమ్మకం

నాన్నే నా నమ్మకం ఎందుకంటారా
నను చక్కగా చదివించి నిత్యం నావెంటే ఉండి
నాకు మంచి బుద్దులు నేర్పి
నేను చేసే ప్రతి పనియందు తప్పొప్పులు చూపి
నా లక్ష్యానికి దారులు వేసి
నా విజయాలకు వారధిలా మారి
ముందుంటారు కాబట్టి అందుకే నాన్నే నా నమ్మకం

-సి.హెచ్. కళ్యాణ్
8వ తరగతి

## నాన్న మనస్సు

అన్నింటిలో ముందుండుమంటారు నాన్న
తను ముందుండి మనల్ని ముందుకు నడిపిస్తారు నాన్న
భుజం తట్టి ధైర్యం నింపి భయాన్ని తొలగిస్తారు నాన్న
అందరితో మంచి విషయాలు పంచుకోమంటాడు
పదిమందిలో గొప్పగా జీవించమంటాడు
అందుకే నాన్న మనస్సు తీయనైన మనస్సు

-బి. రూపేశ్
8వ తరగతి

## దేవత

మా అమ్మే నాకు ఒక దేవత
అడగకుండానే అనేక వరాలిస్తుంది
ఆకలి అని చెప్పకుండానే చందమామను చూపెడుతూ
గోరుముద్దలు తినిపిస్తుంది
అడుగడుగునా ఆప్యాయతను పంచే
మా అమ్మ నిజంగా నాకు కనబడే దేవత

-బి. లావణ్య
8వ తరగతి

## తరగని పే్రమ

అమ్మ ప్రేమ అమృతం
నా జీవితానికి తొలిమార్గం అమ్మ
నన్ను ఈ జీవకోటికి పరిచయం చేసింది అమ్మే
అమ్మంటే అమృతంతో సమానం
అమ్మంటే నాకు ఆదిదైవం
అమ్మంటే ఎన్నటికి తరగని ప్రేమ
అమ్మంటే అనురాగాల అనుబంధం
అందుకే అమ్మ తరగని ప్రేమ

-ఆకాశ్
8వ తరగతి

## నాన్నంటే ఇష్టమే

నాన్న నాకు నడక నేర్పాడు
మంచి నడత నేర్పాడు
నాన్న గురువులాంటోడు
గుడిలో దేవుడిలాంటోడు
నిత్యం తోడు నీడలా నిలిచి
అడుగులో అడుగై నిరంతరం వెలుగై
భవిష్యత్ అంధకారం కాకుండా
అజ్ఞాన తిమిరాన్ని తొలగించి
ఆచార్యుడిలాగ ఆదరించే
నాన్నంటే నాకిష్టమే

-కృష్ణవేణి
7వ తరగతి

## కనబడే దేవుళ్ళు

అవును అమ్మా నాన్నలు కనబడే దేవుళ్ళే
ఎందుకంటారా అమ్మ నేర్పును మాట
నాన్న జూపును బాట
నాన్న తీయని మాట అమ్మ కమ్మని పాట
ఎంతో మధురం
తల్లిదండ్రులు లేక పిల్లలు ఉంటారో తెలియదు కానీ
పిల్లలు లేక తల్లిదండ్రులు ఒక క్షణం గడపలేరు
అందుకే కనబడే దేవుళ్ళే అమ్మానాన్నలు

-ఎస్.డి. సమీనా
7వ తరగతి

## అమ్మ అమ్మే

నా జీవితానికి మార్గం చూపెడుతూ
నన్ను మంచి దారిలో నడిపిస్తూ
నా బాధను తన బాధగా చేసుకొని
నాకు జ్వరం వస్తే ఇల్లునే ఆసుపత్రిగా మార్చి
దెబ్బతగిలితే మందుని పెట్టి
ఎన్నో నిదురలేని రాత్రులు గడిపే
అమ్మ ఎప్పటికీ అమ్మే

-ఎ. సచిన్
8వ తరగతి

## నాన్న నారక్షణ

నాన్న మన రక్షణ
నిత్యం ఒక సైనికుడిలాగా నీడలాగా
మనకు రక్షణ కల్పిస్తాడు
నాన్నబాట ముళ్ళబాటయైనా మనకు మల్లెబాట వేస్తాడు
మనకు ఒక జీవితాన్ని అందిస్తాడు
నాన్నే మన ఆయుధం నాన్నే మన రక్షణ

-యం. మీనాక్షి
7వ తరగతి

## అమ్మ గొప్పతనం

ఈ సృష్టికి జీవం పోసింది తన గర్భగుడిలో
మనల్ని పెంచింది
మనల్ని నవమాసాలు మోసి
ఈ ప్రపంచానికి పరిచయం చేసింది
మనకు మొదటి గురువై నిలిచింది
మనకు సంస్కారాన్ని సభ్యతను నేర్పి
ఒక మంచి భవిష్యత్తును చూపెడుతుంది

-ఎ. వైష్ణవి
8వ తరగతి

## నాన్న బాట

మనల్ని ఆడిస్తూ పాడిస్తూ మంచి నడతను నేర్పి
స్నేహితుడిగా గురువుగా బంధువుగా ప్రేమను పంచుతూ
మనతో ప్రేమగా మాట్లాడే నాన్న ప్రేమ నవరసభరితం
కష్టంతో కాకుండా ఇష్టంతో పెంచే నాన్న నవ్యమైన మార్గదర్శకుడు
నలువిధాల బలం కొండంత అండ మా నాన్నే
నిరంతరం కనురెప్పల్లా కంటికి కాపాడే
మా నాన్న బాట నందనవనం

-డి. అనూష
8వ తరగతి

## మాతృమూర్తి

జగతికి మూలం అమ్మ నా జన్మకు కారణం అమ్మ
గోరుముద్దలు తినిపించి ఏడిస్తే బుజ్జగించి
నా ఆలనా పాలనా చూసుకుంది
అమృతమైన ప్రేమను పంచింది అమ్మ
మాట వేదమూట వరాల బాట
అమ్మ అందరికన్నా మిన్న ఆదిశక్తియే అమ్మ
ఆనందాల పొదరిల్లే అమ్మ

-డి. అభిలాష్
8వ తరగతి

## దేవుడి వరం అమ్మ

మా మంచి అమ్మ విరబూసిన పూల కొమ్మ
బ్రహ్మ మన తలరాతను రాస్తే
అమ్మ మన జీవితాన్ని రాస్తుంది
తొమ్మిది నెలలు మోసిన అమ్మ నాకు జన్మనిచ్చిన అమ్మ
రెండు పదాలు కలగలసిన అమ్మ
దేవుడి వరమిచ్చిన అమ్మ

-బి. హన్సిక
7వ తరగతి

## తల్లిదండ్రులు-పద్యం

అమ్మ ప్రేమ మనకు ఆప్యాయతను నింపు
నాన్న ప్రేమ మనకు నడత నేర్పు
తల్లిదండ్రులన్న ధర్మ దేవతలురా
అవసరమును తీర్చు అమ్మనాన్న

కరుణ పంచి మనకు కమ్మదనము జూపు
కష్టసుఖములందు కరుణ పంచు
త్యాగ భావమందు తల్లిదండ్రులు మిన్న
అవనిలోనే గొప్ప అమ్మనాన్న

-యం. జాహ్నవి
9వ తరగతి

## అమ్మ నాన్నే జీవితం

అమ్మ మనకు జీవితాన్నిస్తుంది
నాన్న మనకు జీవితాంతం తోడుంటాడు
అమ్మ మనకు ప్రేమను కురిపిస్తే
నాన్న మనకు ప్రేమగా చూసుకుంటాడు
అమ్మనాన్న లేనిదే సృష్టిలేదు
అమ్మ అంటే తీయదనం నాన్న అంటే కమ్మదనం
అమ్మలేని జీవితం లేదు నాన్నలేని లోకం లేదు
అందుకే అమ్మ నాన్నలని మరవకు
అమ్మ నాన్న యున్న జీవితమే ముద్దు

-యం. గంగాదేవి
8వ తరగతి

## సృష్టికర్త అమ్మ

సృష్టికి జీవం పోసినది
రెండక్షరముల కలబోత అమ్మ అదే అమ్మ ప్రేమ
తన ప్రాణాలను అడ్డుపెట్టి మన ప్రాణములను కాపాడుతుంది
తొమ్మిది నెలలు మోస్తుంది పెంచి పెద్ద చేసి
సంస్కారమును నేర్పి
సమాజానికి పరిచయం చేస్తుంది
అందుకే సృష్టికర్త అమ్మ
అమ్మ లేనిదే సృష్టి లేదు

-ఎ. ముఖేష్
8వ తరగతి

## అమ్మ నాన్న అనుబంధం

నా నిజమైన హీరో హీరోయిన్ మా అమ్మ నాన్నలే
నా నవ్వుకు మారుపేరు మా అమ్మ అయితే
నా ప్రేమకు ప్రతిరూపం మా నాన్నే
మనం ఏడిస్తే కన్నీళ్ళు తుడిచేది అమ్మయితే
మన మనస్సును తెలుసుకుని నడిచేవారు నాన్న
నా ఆశ మా అమ్మ అయితే నా అశయం మా నాన్న
అందుకే అమ్మ నాన్నలే అనుబంధానికి ప్రతీకలు

-ఎల్. కీర్తన
8వ తరగతి

## మా మంచి అమ్మ

నన్ను నవమాసాలు మోసి
అల్లారుముద్దుగా పెంచింది అమ్మ
నాకు గోరుముద్దలు తినిపించి
చందమామను చూపించి
చక్కని కథలను చెప్పి
నన్ను నిరంతరం
తన లోకంగా భావించే అమ్మే నా సర్వం
కష్టసుఖాలను చెబుతుంది
కష్టపెట్టలేదు నన్నెప్పుడూ
మంచి మాటలను చెప్పి
మంచి మార్గాన్ని చూపెట్టింది
అందుకే మా అమ్మ
మంచి అమ్మ

-యం.డి. సానియా
8వ తరగతి

## అమ్మ పే్రమ అమృతం

అమ్మ అనురాగన్ని పంచి
ఆప్యాయతను పెంచి
అనుబంధాలను నేర్పి
మనల్ని నిత్యం ఆనంద పరుస్తూ
ఆడుతూ పాడుతూ
అస్తమానం ఆనందమయం చేసే
అమ్మ ప్రేమ అజరామరమైనది
తన చేతి గోరుముద్దలు పెడుతూ
కొండంత బలాన్నిస్తుంది
మనం చేసిన తప్పులని కష్టంతో కాకుండా
ఇష్టంతో సరిదిద్దుతుంది
అందుకే అమ్మ ప్రేమ అమృతంతో సమానం

-బి. ఉదయ్
8వ తరగతి

## అమ్మకు ప్రేమతో

అవనిపై ఆ దేవుని అద్భుత సృష్టి అమ్మ
అమృతం కన్నా మధురమైన అమ్మ ప్రేమ
స్వచ్ఛమైన ప్రేమకి ప్రతిరూపం
ఆప్యాయతానురాగాలకు చిరునామా
నిదురేరాని కళ్ళకు జోలపాట అమ్మ
త్యాగమనే పదానికి నిర్వచనం
అపురూపమైన తొలి స్నేహ మాధుర్యం అమ్మేకదా
అందుకే ఈ చిరు కవిత అమ్మకు ప్రేమతోనే

-ఎన్. పావని
10వ తరగతి

## అమ్మా నీకు వందనం

అమ్మా నీకు నా వందనం అభివందనం
ఏమని చెప్పాలి నీ గూర్చి ఎన్నని చెప్పాలి నీ గూర్చి
మాటలు రావడంలేదు మమతానురాగాలు తప్ప
మంచితనానికి మారుపేరు మాధుర్యానికి ముద్దుపేరు
కష్టము వచ్చినా కడుపులో పెట్టుకునే మా అమ్మకు
వందనం అభివందనం

-ఎం. చైతన్య
8వ తరగతి

## సృష్టి కర్త

అమ్మ నిజంగా సృష్టి కర్తే
ప్రతి జీవి ప్రాణం పోసుకోవాలన్నా
దానికి మూలకారణం అమ్మా అనే పదమే
ఏ జీవికైనా అమ్మ కావాలి అమ్మ అవసరం ఉండాలి
అమ్మనే బ్రహ్మ బ్రహ్మకు మరోపేరు అమ్మే కదా

-జి. అనూష
8వ తరగతి

## కనురెప్పే అమ్మ

అమ్మ నాకు జీవితాన్ని ప్రసాదించావు
నన్ను జాగ్రత్తగా పెంచావు
నాకు నీ తీయనైన పాలనిచ్చి నన్ను పెంచావు
నా కంటికి కనురెప్పలాగా నిరంతరం నన్ను కాపాడావు
నా సృష్టిలో దైవం నీవే నా కలల చిరునామా నీవే
నా అమృతపు బొమ్మవు నీవే
నా శ్వాసవు నా యాసవు నీవే
ఎన్ని సంవత్సరాలకైనా
నా కనురెప్ప నీవే కదా అమ్మ

-యస్.డి. ఆరీఫ్
7వ తరగతి

## అభయ ప్రధాతలు

అమ్మనాన్న ఆ పదాలే అమృత తుల్యములు
వేలకోట్ల పదాలున్నా అమ్మనాన్న పదాలను మించినవి లేవు
అమ్మ నవమాసాలు మోస్తే నాన్న నడకను నడతను నేర్పుతాడు
అమ్మ అక్షరములను దిద్దిస్తే
నాన్న అక్షర జీవితాన్ని చూపెడతాడు
కన్నీటి కడగండ్లను కారుణ్య భావంతో తొలగించే
అమ్మ నాన్నలే మన జీవితానికి అభయ ప్రదాతలు

-యస్.డి. అరీఫ్
7వ తరగతి





పుస్తక సమీక్ష

# చక్కని గేయాలతో "ఒక్కేసి పువ్వేసి చందమామ"

పసితనం, ఏమీ తెలియని తనం, పెద్దలు ఏమి చేస్తే దాన్ని అలాగే అనుకరించే తత్త్వం, ఏది కనిపిస్తే అది నిజమనే నమ్మే అమాయకత్వం, చూసిందంతా తనకే కావాలనుకునే ఆరాటం, కనిపించిందంతా నోట్లో పెట్టేసుకోవాలనుకునే ఆత్రం, ఎక్కడైనా తానే గెలవాలనుకునే చిలిపితనం తో తయారైన బాల్యం ఎంతో ఉన్నతమైనది. వారికి మనసులో ఒకటి, బయట ఒకటి మాట్లాడటం వారికి తెలియదు. ఒకరకంగా సంతోషానికి అర్థం తెలియజేసే దశ అని చెప్పవచ్చు.

కాకుంటే ఆధునికత ముసుగులో మనం చాలావరకు అనేక సంప్రదాయాల్ని, పద్ధతుల్ని తొక్కివేసి, అది తప్పని వాదిస్తూ జీవించేస్తుంటాం. కానీ నిజానికి అది మన నిజ స్వరూపం కాదు, ఎందుకంటే చెయెత్తి ఆ భగవంతుని ప్రార్థించని ప్రాణి ఈ లోకంలో దాదాపుగా ఉండదు. అయితే ఆ ప్రార్థన ఎందుకు అనేది ఎవరికీ తెలియదు. ఏదో కావాలని కోరుకోవడం, అది తీరితే మొక్కు చెల్లించేయడం, లేకుంటే ఊరుకోవడం మాత్రమే తెలిసిన మనలో చాలా మంది ఉన్నారు. కానీ నేడు ఇలా కాకుండా పత్తిపాక మోహన్ బాలలకు మన పండగల్ని, వాటి ప్రాశస్త్యాన్ని తెలిపే ప్రయత్నంలో ఈ బాలల గేయాల్ని ఒక పుస్తకరూపంలోకి తేవడమే కాదు, అందరూ చదువుకునే తీరులో ఒక్కేసి పువ్వేసి చందమామ అనే అద్వితీయమైన గ్రంథాన్ని తీసుకు వచ్చేరు. ముఖచిత్రంపై ముద్దుముద్దుగా బాలికలు బతుకమ్మను తీర్చిదిద్దుతూన్న చిత్రం బహు రమణీయంగా ఉంది. ఈ గ్రంథంలో పండుగలు, వాటి ప్రాశస్త్యం బతుకమ్మ పండుగ అంతరార్థం, బాద్రపద మాసంలో తొమ్మిది రోజులపాటు ప్రతి ఇంటిముందు వాకిట్లో ముగ్గులు పెట్టి బతుకమ్మను పేర్చి ముత్తయిదువులంతా కలిసి ఆడుకునే తీరు, అందులోని అంతర్యం కూలంకుషంగా పసిపిల్లలకు సైతం అర్థమయ్యేతీరులో వర్ణించారు.




అంతేకాకుండా బతుకమ్మ పండుగ విశిష్టత, బతుకమ్మ పర్యావరణ పరివేక్షణ, తెలంగాణ ప్రజల వీరత్వానికి త్యాగాలకు ప్రతిరూపమైన తెలంగాణ ఆచార వ్యవహారాలు వివరించడం ఈ గ్రంథం ఎంతో ఉపయుక్తంగా ఉంది. సంప్రదాయాలను బతికించుకునే క్రమంలో తరతరాలకు ఆచార వ్యవహారాలను పాటించాలనే తపన ఈ గ్రంథంలో కనిపిస్తుంది. ఇదొక అద్భుతమైన ప్రయత్నం, ఈ గ్రంథంలో అనేక బతుకమ్మ పాటలు ఉన్నాయి. నేర్చుకుని పాడుకునేందుకు వీలుగా ఉంది. ఇటువంటి గ్రంథాలు మరిన్ని రావాలని కోరుకుంటూ కవికి అభినందనలు

ప్రతులకు:సిరిసిల్ల చందన
కే/ఆఫ్. 301, స్వస్తిక్ రెసిడెన్సీ
సాయిబాబా టెంపుల్ దగ్గర
రాజీవ్‌నగర్ కాలనీ
భూదేవినగర్, తిరుమల్‌గిరి
సికింద్రాబాద్-500 015
వెల: 30/-
9811 239219

-శైలజామిత్ర
9290900879



నేటినిజం
# సాహితీ కెరటాలు
E-mail : netinijam93@gmail.com
website: www.netinijam.com
గురువారం 19-12-2019 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 హైదరాబాద్ 3

### నమ్మలేని నిజాలు

వెతుకులాట
నాణ్యమైన చరిత్ర
బొమ్మ బొరుసా

బండెడు చెత్త
విద్యుత్తు వికాస కేంద్రం
చెత్తకు షాకు

ప్రాంతీయ భాష
గారెలు ఆవకాయ
రుచి తగ్గదు

కైలాస దేశం
వెళ్లిన మళ్లిరాలేం
నిత్యం ఆనందం

కైఫల కేఫులు
అన్ని దిశల్ కలవు
ఊడల మర్రి



- రేడియమ్
9291527757

### శ్రీనిజాలు

నలుగురు కలుస్తే చాలు
బారు నోరు తెరుస్తుంది!
తప్ప తాగి బయట కొస్తె
కారు గేరు మురుస్తుంది!

బోరు కొడితె బీరు విస్కి
భలే వింత విందు!
తాగ కున్న రేట్లు చూస్తె
కిక్కు ఎక్కు మందు!



- కందుకూరి శ్రీరాములు
సెల్:9440119245

# చిరునవ్వుతో ప్రపంచాన్ని జయించగలరు వారు

నదీ తరంగాలు ఉత్తుంగమవుతున్నాయి
ఇసుక మేటల నుండి కూడా రాగాలు వస్తున్నాయి
కిన్నెరసాని రాగంలో అఆలు పలుకుతున్నాయి
మబ్బులు నిబ్బరంగా ఆకాశంలో చలిస్తున్నాయి
నక్షత్రాలు మబ్బుల పై నిద్రిస్తున్నాయి
అడవి విరగబూసినపుడంతా ఒక సుగంధ పరిమళం
భూమి నెర్రెల నుండి కూడా ఒక శబ్దం వినిపిస్తుంది
జీవించడానికి ప్రకృతే ఊపిరి కదా!
ఆ మెత్తని చేతులు శిల్పించిన శిల్పాలు
సజీవ దృశ్యాలవుతున్నాయి
అతడు బడిబయట కూర్చున్నాడు
విద్యకే సార్వభౌముడయ్యాడు
ఆ తల్లి చిలికిన మజ్జిగ నుండి
వెన్నముద్దలా తన బిడ్డను తీసింది
దళిత బిడ్డలు సూర్యగోళాలు ఆకాశ నక్షత్రాలు
జీవిత గమనంలో ఆత్మ స్థైర్యం వారికి నిధి
ఈ దేశంనాది, ఈ భూమినాది, ఈ భాషనాది
ఈ సంస్కృతి నాదనే ఆత్మగౌరవపు పిలుపువారిది

సృజనానికి మూలమైనా పునాదులను
వారు వేస్తూ వచ్చారు
వారి భాషలో అనంత కవిత్వం వుంది
కథనా కథన చాతుర్యం వుంది
గుర్రపు నడకలోని కుదుపువుంది
మట్టి నుండి ఎన్నో మాణిక్యాలు తీశారు వారు
అక్షరాన్ని మౌఖికంగా భాషించారు
అక్షరాన్ని లిఖితంగా సృష్టించారు
బొటనవేళ్ళతో నేలపై
భాషా శాసనాలు సృష్టించారు
ఒక సంతరవిదాసు ఒక జాషువామహాకవి
ఒక దయాపవర్‌లు అందుండి వెలశారు
కవితాకాశంలో నక్షత్రాలయ్యారు
వారిదొక పరిణామ చరిత్ర
ప్రతి అడుగులో మలుపులున్నాయి
అణచివేతను వారు అధిగమిస్తారు
కొదమసింగములై గర్జిస్తారు
జీవితాన్ని పోరాటంగా స్వీకరిస్తారు

రాజ్యాన్ని దోపిడీ శక్తిగా గుర్తిస్తారు
అవును! ఆ నూత్న తరం దళిత యువతులు
కదులుతున్న జీవన ప్రభాతాలు
గీస్తున్న భావనా చిత్రాలు
విద్య వారి పాదాల వెంట నడుస్తుంది
వారి చరణాలు ఎన్నో చూపులను
తొక్కుకొంటూ వెళుతున్నాయి వారు వాక్కుల నిధులు
నిజమే! చీకటిని చీల్చగల శక్తి వారికి వుంది
చిరునవ్వుతో ప్రపంచాన్ని జయించగలరు వారు
వారు అంబేద్కర్ మహద్ చెరువు
పోరాట స్ఫూర్తిని అందుకున్నారు
సావిత్రీబాయి పూలే విద్యా పరిమళాన్ని అందుకున్నారు
వారిది రమాబాయిలోని నిజాయితీ
వారు ఖడాంతరాలను చుట్టుముడుతున్నారు
ఇంగ్లీషు భాషకు వన్నె తెస్తున్నారు
దళిత 'యువతి' ఓ కదులుతున్న కడలి
మేము మనుషలమే కాదు

మానవ సమాజ పరిణామ కర్తలం
మనిషి అమానుషం అవుతున్నపుడంతా
మేము గొంతు ఎత్తుతున్నాం
దిశ గొంతు నులిమారు
నడిరోడ్డుపై అత్యాచారం జరిపారు
అవును! వారు కాల్చబడ్డారు
వారి గొంతు నులిమినవారి
వారసులే ఇప్పుడు గగ్గోలు పెడుతున్నారు
'నైతిక శక్తి తగ్గుతుంది !
మనిషిని మనిషి బలితీసుకునే సమాజం వస్తుంది'
అని మేము చెబుతూనే వున్నాం
మరి మీరెందుకు మద్యాన్ని ఏరులుగా పారించారు
మత్తు మందులు విరజిమ్మారు
రాజ్యం అరాచకం దీని వెనుకలేదా!
అందుకే మళ్ళీ బుద్ధుని ధర్మం కావాలి
కామవ్యామోహాలు నియంత్రించాలి
జ్ఞాన సముద్రాలు పొందాలి
సమాజ పునర్నిర్మాణం మన కర్తవ్యం...



-డా॥ కత్తి పద్మారావు
సెల్:9849741695

# 'కలల సౌధాలలో' పుస్తకావిష్కరణ

కలలు రెండు రకాలని ఒకటి నిద్దురలో కనే కలలు, మరోటి నిజ జీవితంలో పట్టుదలతో కృషితో సాధించే కలలు అని నేటినిజం సంపాదకులు బైస దేవదాసు అన్నారు.

ప్రముఖ రచయిత ఎం. బాల గంగాధరయ్య రచించిన 'కలల సౌధాలలో' పుస్తకావిష్కరణ సభ, సాహితీ కిరణం, శ్రీ త్యాగరాయ గానసభ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం గానసభలోని కళా సుబ్బారావు కళావేదికలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నేటినిజం సంపాదకులు బైస దేవదాసు పాల్గొని పుస్తకాన్ని ఆవిష్కరించి మాట్లాడుతు ఈ పుస్తకంలోని కథలు నిజ జీవితంలో జరుగుతున్న సంఘటనలు గుర్తు చేస్తున్నాయని అన్నారు. రెండేళ్ళ కాలంలో బాల గంగాధరయ్య పది పుస్తకాలను వెలువరించి సాహిత్యం పట్ల తనకున్న మక్కువను చాటుకు న్నారని, కథల సంపుటులతో పాటు కవితా సంపుటులు కూడా వెలువరించి సాహిత్య కృషి చేస్తున్న బాల గంగాధరయ్యను అభినందించారు.

బాల గంగాధరయ్య రచన శైలి భిన్నంగా ఉంటాయని పేర్కొన్నారు. ఆయన కథలు విభిన్నమైన రీతిలో సందేశాత్మకంగా ఉన్నాయని తెలిపారు.

సాహితీ కిరణం గౌరవ సంపాదకులు గుది బండి వెంకటరెడ్డి సభాధ్యక్షత వహించిన కార్యక్రమంలో గానసభ అధ్యక్షుడు కళా జనార్ధనమూర్తి, సాహితీకిరణం సంపాదకుడు పొత్తూరి సుబ్బారావు, సాహితీవేత్తలు డా॥ పూసల రజనీ గంగాధర్, డా॥పి. లలితరాణి,

ఈ కలల సౌధంలో కథల సంపుటిని రచయిత బాల గంగాధరయ్య తన మనవరాలు సౌగంధికకు అంకితం ఇచ్చారు. ప్రముఖ సాహితీవేత్త డా॥పి. లలితరాణి పుస్తక సమీక్ష చేశారు.

పాల్గొన్నారు. సభకు ముందు పెద్దూరి వెంకటదాసు నేతృత్వంలో జరిగిన "హేమంత సమీరాలు" కవి సమ్మేళనంలో శ్రీమతి పంకజామల్లిక్ శ్రీమతి సుబ్బాయమ్మ, శ్రీమతి పద్మశ్రీలత, శ్రీమతి శిరీష, శ్రీమతి మాధవీ శ్రీనివాస్, శ్రీమతి ఉమాశశి, శ్రీయుతులు రాధాకృష్ణ, డా॥ ఊసల గంగాధర్, ఎన్వీ రఘువీర్ ప్రతాప్, రఘుపతిలు పాల్గొన్నారు.



పుస్తకావిష్కరణలో పొత్తూరి సుబ్బారావు, పెద్దూరి వెంకటదాసు, కళా జనార్ధనమూర్తి, బాల గంగాధరయ్య, ఆవిష్కర్త బైస దేవదాసు, గుదిబండి వెంకటరెడ్డి, డా॥ పూసల రజనీ గంగాధర్, డా॥ పి. లలితారాణి, కుమారి సౌగంధిక



రచయిత బాల గంగాధరయ్యను సత్కరిస్తున్న అతిథులు.



కుమారి సౌగంధికకు 'కలల సౌధాలలో" పుస్తకాన్ని అంకితమిస్తున్న అతిథులు.

# సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలుగెత్తి జైకొట్టిన అంతర్జాతీయ సాహితీ సదస్సు





వర్తమాన పరిస్థితుల్లో తెలుగు సాహిత్య రంగానికి దశా దిశ నిర్దేశించేందుకు మూడు రోజుల పాటు తెలంగాణ సాహితీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ సాహితీ సదస్సు జరిగింది. ఈ సదస్సులో సంస్కృతీ పేరిట జరుగుతున్న విధ్వంసాన్ని నేటి యువతరానికి అవగాహన కల్పించేందుకు బృహత్ లక్ష్యంతో తెలంగాణ సాహితీ సంస్థ నిర్వహించిన అంతర్జాతీయ సాహితీ పండుగ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో శనివారం ఘనంగా ప్రారంభమైంది. ప్రారంభ సభలో ముఖ్య అతిథిగా కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహిత, ప్రముఖ హిందీ కవి మంగలేష్ దబ్రాల్ పాల్గొనగా, సదస్సును సాహిత్య అకాడమీ అధ్యక్షులు డా॥ నందిని సిధారెడ్డి ప్రారంభించారు. ప్రఖ్యాత కవి డాక్టర్ శివారెడ్డి 135 మంది పరిశోధక విద్యార్థులు, రచయితలు రాసిన శతాధిక సాహితీవేత్తల జీవితం–సాహిత్యం "తెలుగెత్తి జైకొట్టు" గ్రంథాన్ని ఆవిష్కరించారు. తెలంగాణ సాహితి ప్రధాన కార్యదర్శి కె.ఆనందాచారి అధ్యక్షత వహించిన ఈ సభలో గోరటి వెంకన్న, సూర్య ధనంజయ్, నిఖిలేశ్వర్, తెల్పల్లి రవి, మువ్వా శ్రీనివాసరావు, సుధామ, అనంతోజు మోహనకృష్ణ పలువురు ప్రముఖులు సాహిత్యం–సమాజం–ప్రస్తుత పరిస్థితులు అంశాలపై ప్రసంగించారు.

### నిట్టూర్పుల వేదాలు

ఊరకే రావు కలలు
వచ్చిన తడువే అదిమి పట్టి
వేళ్ళాడాలి వదలకుండా.
పుసికిపోతే..
రెక్కలు లేని పక్షిలా
పించం లేని నెమలిలా
పంజా లేని పులిలా
ఒడుదొడుకులే జీవితమంతా.
నేలపైనే తచ్చాడాలి
జారుడు బండలపై దొర్లాడాలి
ఎండమావుల్లో ఈదాలి.
అడియాసల పాలై
నిట్టూర్పుల వేదాలు వల్లించాలి!



- ఆచార్య కదారు వీరారెడ్డి
9392447007



బాబా అటానమిక్ రీసెర్స్ సెంటర్‌లో సీనియర్ సైంటిస్ట్‌గా పనిచేస్తున్న జే. డేనియల్ చెల్లప్పకు సేవా రంగంలో తాను చేస్తున్న కృషికిగానూ అరుదైన గౌరవం లభించింది. ఆదివారం నగరంలో జరిగిన ఓ కార్యక్రమంలో తెలంగాణ హోంశాఖ మంత్రి మహమూద్ అలీ చేతుల మీదుగా పీఆర్ఎస్ఐ లీడర్‌షిప్ 2019 అవార్డును చెల్లప్ప అందుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కే.వీ. రమణాచారి పాల్గొన్నారు. అనేక రంగాల్లో ప్రజలకు తన సేవలందిస్తూ సేవా కార్యక్రమాలతో ప్రజల బాగోగులను చూస్తున్నందుకుగానూ ఈ అవార్డును అందజేశారు.




# ఉత్తమ సందేశాత్మక చిత్రం "లావణ్య..."

ఎన్ఆర్ఐ శరత్ సమర్పణలో సి. రాజ్యలక్ష్మి, నర్సింలు పటేలు చెట్టి నిర్మించగా, డా॥వడ్డేపల్లి కృష్ణ చక్కని రచనతో పాటు సమర్థవంతంగా దర్శకత్వం వహించిన "లావణ్య విత్ లవ్ బాయ్స్" చిత్రాన్ని రవీంద్ర భారతి "పైడిజై రాజ్ థియేటర్"లో సాంస్కృతిక శాఖ సౌజన్యంతో ప్రదర్శింప జేశారు.

అందమైన అమ్మాయి కనిపించగానే ప్రేమ పేరుతో వెంటపడి వేదించడం కాదు, జీవితాంతం తోడునీడై విపత్కర పరిస్థితుల్లో కూడా విడిపోకుండా వుండగలిగినవాడే నిజమైన "ప్రేమికుడు" అనే ఉత్తమ సందేశాన్ని అందించిన చిత్రం "లావణ్య విత్ లవ్ బాయ్స్".

కావున ప్రస్తుత విపరీత ధోరణుల్లో సామాజికంగా యువతీ యువకులకు కనువిప్పు కలిగేలా సందేశాన్ని అందిస్తూనే వినోదాత్మకంగానూ చిత్రాన్ని వెండితెర కెక్కించినందుకు, నిర్మాత దర్శకుల్ని బి.సి. కమీషన్ ఛైర్మన్ బి.యస్.రాములు, సంగీత నాటక అకాడమీ అధ్యక్షులు లూద్మి శివకుమార్, ప్రభృతులు శాలువాలతో సత్కరించి అభినందించారు.

ఈ చిత్రంలో నటించిన సత్కళాభారతి సత్యనారాయణ సత్యంయాచి, దుయ్యూరి రామ్మోహన్, హీరో కిరణ్ పాల్గొని ప్రసంగించారు.

స్థానిక నటీనటులకు మంచి అవకాశాలిచ్చి ప్రోత్సహించడమే గాక, చక్కని తెలంగాణ మాండలికంలో "సిరిసిల్ల తల్లిగారు– సిద్దిపేట అత్తగారు, కట్టుకున్న పోరగాడు స్వతట్ల నారిగాడు" అనే పాటను ప్రవేశపెట్టినందుకు డా॥ వడ్డేపల్లి కృష్ణకు సాహిత్య అకాడమీ కార్యదర్శి ఏనుగు నరసింహారెడ్డి ప్రత్యేకంగా అభినందించారు.



డా॥ వడ్డేపల్లి కృష్ణను సత్కరిస్తున్న అతిథులు.

### నిజాలు!

మృదు భాషణం ఓ కళ–
శ్రద్ధావలోకనం...వరమే ఇల.
అవధులు వదులైతే–
'మనమిక' అవధూతే.
ఆరోగ్యమే 'మహా భాగ్యం'–
కార్పొరెట్ హాస్పిటల్ బోధపర్చిన సత్యం.
ఇష్టం ఓ అవ్యక్తానుభూతి–
స్పష్టం..అది..భాషకందని..హృదయ కృతి.
వ్యాఖ్య లేకుంటే హుందాగా–
నోరు కాదది పెంట బొందేగా.
మనసున్నదే..మర్మానికి–
గుట్టును రట్టుచేసి వదలకు ఖర్మానికి.
ప్రతి కవితా ప్రసవమే–
మృత శిశువులూ..వికృతా కృతులూ..సహజం..

వదులుకోకతప్పదు–
తనువుతో సహా.,మురుగని ఎంచి.
బ్రతుకు వెళ్ళదీయాలి–
సంతోషాన్ని సంకనేసుకుని.
ఎలా కొనుక్క రానూ కాలాన్ని.–
ఓనా కవితా...నిద్రను బలివ్వడం మినహా.
కలవరిస్తే ఏం లాభం–
కల వరించాలి, కలవర పెట్టకుండా.



–డా॥గొల్లపెల్లి రాంకిషన్
9849693324.

## నవనాగరిక యుగంలో నరజాతి మృగాలు

తీయని మాటల తేనెను నోటికందించి
విష సర్పపు బుసలు కొట్టే వికృత రూపాలు
అంచెలంచెలుగా తానే ఎదగాలనే తాపత్రయంతో
స్వార్థంతో ఎదుటివారిని పావులాగ ఉపయోగించుకొనే
పాపాత్ములు.

అడుగడుగునా మోసాలతో
ధనవంతులయినా దళారుల అవతారమెత్తి
డబ్బులు లాగడంలో సిద్ధహస్తులు
అంతా నాకే తెలుసనే అహంకారంతో
ఎదుటివారిని కించపరిచే కిరాతకులు
కుళ్ళు, రాజకీయాల స్వార్థాలలో మునిగి
అన్యాయాలకు అకృత్యాలకు వెనుకాడని
మానవ మకరాలు
అమాయకుల పసిపాపలను జీవితాలను
మొగ్గలోనే చిదిమేసి
శీలాలను దోచుకునే అపర కీచకులు
లోకాన్ని, దేశాన్ని దోచేసికొని
తాను తన కుటుంబం సౌఖ్యంగా ఉండాలని
కోరుకునే లోక కంటకులు
ఈ కలియుగం ఎప్పటికి మారేను
సస్యశ్యామల మనదేశానికి
ఈ చీడ ఎప్పుడు వదిలేను
మన భారతి మదినిండా ఎప్పుడు నవ్వేను.
మారాలి ఇప్పటికయినా అందరూ
మానవత్వం ఉన్నవారు మంచి మార్గంలో నడవాలి
శిలనయినా చెక్కితే రూపం వస్తుంది
ప్రాణమున్న మనిషిగా హృదయం ద్రవించాలి
జీవితం బుద్బుద ప్రాయమని స్థిరంగా ఉండబోమని
ఏదీ మన వెంట రాదని
బ్రతికినన్ని రోజులు
న్యాయంగా బ్రతుకుదామని
భావించాలి, ఆచరించాలి,
అందరికీ ఆదర్శమై నిలవాలి.



– వై.సుగుణాదేవి
సెల్:9010480955

## ఏమి మారెను...?

ఏమి మారెను ఏమి మారెనురో
ఈ మాయలోకం రాకాసి మూకలాయెరో

వింతైన మనిషి పోకడ
పశువుకన్న హీనమాయెనురో
సాటి మనిషిని కనికరించక
కసితోడ నరకుడాయెనురో!

కన్నవారిని తూలనాడిరి
ఆలుబిడ్డల వెడలగొట్టిరి
వావివరసలు మరిచిపోయిరి
మానవత్వం మంటగలిసెనురో!

చిన్న చిన్న తగాదాలకే
కత్తులతో సాములాయె
నడిబజారులో నరకుడాయె
రక్తపాతం చిందివేసిరో..

ఇంటింటిలో జగడమాయె
భార్యభర్తల కలహాలాయె
అన్నదమ్ముల వైరమాయె
కన్నవారితో కలతలాయెనురో
కాయకష్టం మరచిపోయిరి.
కాపురాలు కూల్చబట్టిరి
పట్టపగలే రక్తపాతాలాయె
ఆడవారితో చెలగాటమాయెనురో
మానభంగాలు చూడకుండ
మానవత్వానికి మచ్చతెచ్చిరి
మనిషి మనుగడకే ముప్పువచ్చెరో..



– ఎం.ఏ.గఫార్
9490324834

## ధీశాలి నాన్న

అమ్మ ఓ వాస్తవం, అనురాగ మాధుర్యం
నాన్న ఓ నమ్మకం, భరోసా ఔదార్యం
అమ్మ జన్మ ప్రదాతగా కనిపించే ఆరాటం
నాన్న భవిత విధాతగా తెరవెనుక పోరాటం!

నాన్న హృదయం హిమచలం
అమృతం నింపుకున్న కలశం
తొణకని వ్యక్తిత్వం.. చెదరని జ్ఞాపకం
నిలువెత్తు గాంభీర్యంతో నడిసొచ్చే ధైర్యం!

సాగరమంత సంసార సంక్షోభాల్లో
ప్రశాంతత నిండిన నీలాకాశం
తన మనసు అర్థంకాని అంతరిక్షం
అంతుచిక్కని పాతాళలోకం!

పొద్దంతా ఆరాట పోరాటాల్లో మునిగి
సాయంత్రం ఇంట్లో ఉదయించే భానుడు
తిండి నిద్రల్ని త్యాగం చేస్తూ
పిల్లల కనురెప్పలే తానైన ధీశాలి!

జీవిత నౌక సుడిగాల్లో చిక్కుకున్నా
కన్నీళ్ళను ఖర్చుచేయక ఒడిసిపట్టి
మా భవితకు ఇంధనంలా వాడే నేర్పరి
నిధీధిలో నివసిస్తూ వెలుగ చిమ్మే సూరీడు!

వ్యసనాల చెడుగాల్లో చిక్కకుండా
క్రమశిక్షణల తెరచాపగా తనుమారి
గమ్యం వైపు నడిపే దీప స్థంభం
బడబాగ్ని దాచుకున్న
దయా సముద్రుడే నాన్న.



– డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

## సరిహద్దులు దాటుదాం!

మంగళ వాద్యాలు
మంత్రోచ్చారణల మధ్య
పాణిగ్రహణం చేసుకుంది
శత్రుదేశాల్లా మారటానికి కాదు
ఆదర్శజీవనానికి హారతి పట్టి
ఒకరికొకరం గొడుగవటానికి

బ్రహ్మముళ్ళేసుకుని
తలంబ్రాలు చల్లుకుని
తనువులు పంచుకున్నది
భవిష్యత్ ముక్కలు చేయడానికి కాదు
గడ్డిపూలను గాలికొదిలి
ధృవనక్షత్రంలా వుండాలని

నువ్వు నేను
ఏడడుగులు నడిచింది
చెరోదారి పయనించి
తాళిబంధాన్ని ఎగతాళి చేయడానికి కాదు
ఏడు జన్మలైనా
వాడని పూవులా ఉండాలని

నావాళ్ళను నువ్వు
నీవాళ్ళను నేను
గుమ్మంతొక్కనీయక
జుట్లు పట్టుకోవడం కాదు
ఇరుకుటుంబాలు
మమతాను రాగాలను పూయించు కోవాలి

మాటలతో మనసును
పాలలా విరగగొట్టి
ఎడముఖం పెడముఖంతో
సంసారంలో పొగపెట్టుకోవడం కాదు
చిలుకా గోరింకలని
చూపరులకు మనం మార్గం చూపాలి



–దామరకుంట శంకరయ్య
9440876788

## భూబకాసురుడు

మట్టిని నమ్మినవాడు
తల్లిని ప్రేమించి పూజించినవాడు
ఎన్నడూ చెడిపోడన్నది
నగ్నసత్యం
పాడిపంటలతో విరాజిల్లే
మన భరతభూమిని
గునపాలతో తెగపొడిచినా
నాగళ్ళతో తెగచీల్చినా
కోపగించుకొనక
ఆహార పానీయాలను
బంగారు పంటలను అందించి
నీ కడుపు నింపుతుంది భూమాత
నువ్వు స్వార్థ పూరితుడవై
బంగారు పల్లకీలో ఊరేగాలని
ఆశా పూరితుడివై
కాలదన్నుకొని
నిస్సంకోచంగా
నిర్మొహమాటంగా
ధనరాశుల కోసం
భూమాతను తెగనమ్మి
మిద్దెలు, మేడలు సమకూర్చుకొని
కనకాభరణాలతో
తులతూగి
కానరాని అహంతో
నడయాడిన నువ్వు
కడకు పిడికెడు
బూడిదగా మారి చేరవలసింది
ఆ భూ గర్భంలోకే..



–రాయవరపు సరస్వతి
9885656356

## నల్లధనం

చీకటి సామ్రాజ్యానికి మేమే రాజులం
మమ్మల్ని ఎవరూ ఏమీ చేయలేరు
ఎవరు చేరనంతదూరంలో ఉన్నాము
చేరినా అందనంత ఎత్తులో ఉన్నాము
సామాన్యున్ని రాబందుల్లా పిక్కుతిని, పిప్పిచేసి
బొర్రలు నింపుకొనే బడాబాబుల కబంధహస్తాల్లో
చిక్కుకుంటాం
అన్యాయం, అక్రమం, మోసం, ధగా
కుట్ర, దోపిడి, దొంగతనం
ఈ పోటీ పరీక్షల్లో ఎవరికి ఎక్కువ
మార్పులు వస్తాయో
వారి దగ్గర నిక్షేపంగా రక్షణుంటది
న్యాయంగా, నీతిని, నిజాయితీగా
ఉండే వారి చేతుల్లో ఉండలేం
వారు మమ్ములను చీత్కరిస్తారు.
ఎవరు ఏమైపోతే మాకేంటి
కాటికెళ్తే మాకేంది
మేము కోరలు దాచుకొని
విషము గ్రక్కుతూనే ఉంటాం
న్యాయ దేవతకు
మమ్ములను చూస్తే భయం
అందుకే కళ్లకు గంతలు కట్టుకుంటుంది
కాళీయుని గర్వమణచి
పడగల మీద నాట్యం చేస్తూ పారిపోయేలా చేసిన
బాలకృష్ణుని లాంటివారు
చీకటి సామ్రాజ్యాన్ని
కూకటివేళ్ళతో పెకిలించడానికి
ఎప్పుడు వస్తాడో!
మాకు విముక్తి లభించేదెన్నటికో
వేచి చూడాల్సిందే!!
నల్లధనమంతా తెల్లదైపోయి
అందరి బతుకుల్లో వెలుగు
చూడాలని మా ఆశ.



– వరుకోలు లక్ష్మయ్య
9704865816

## అస్తిత్వం కోసం పోరాటం!






మనిషి తన అస్తిత్వం కోసం ఎంత దాకా అయినా పోరాడతాడు. బతుకు కోసం వలస వెళ్తాడు పొట్ట కూటి కోసం ఎన్ని వృత్తులైన చేస్తాడు. ఈ సమాజం లో కులం, మతం మనిషి మనుగడ ని ప్రశ్నిస్తుంది. జాతి కులం ఏదైనా సరే మనిషి మరో మనిషి పట్ల వివక్ష చూపడం వివేకం కాదు ..ఇదంతా ఎందుకు చెప్పాల్సి వచ్చింది అంటే ఒకే మతంలో రెండు వర్గాల భిన్న ఆలోచనలు, ఒకరి ఆధిపత్యం మరొకరికి ఎలా శాపం గా పరిణమించింది .. ప్రఖ్యాత నవల/కథా రచయత అయినా సలీం గారు రచించిన **"దూది పింజెలు"** నవల వృత్తాంతం అంత అస్తిత్వం కోసం పోరాడుతుంది.

నవల ఇతివృత్తం ముస్లిం మతంలో కి రెండో పౌరులుగా గుర్తించబడుతున్న దూదేకుల వారి బాధలు, కష్టాలు వస్తువుగా తీసుకొని అద్భుతంగా మలిచారు. సూఫీ సిద్ధాంతాలను ఆచరించి ఇస్లాం స్వీకరించి నా వారి విధానాలను పాటించినా ముస్లింలు దూదేకుల వాళ్ళని నిజమైన ముస్లింలుగా భావించరు .. రెహమాన్ దూదేకుల కులంలో పుట్టినా నాన్న చేసిన తప్పిదం వలన రావాల్సిన ప్రభుత్వ ఉద్యోగం కూడా రాదు .. దూదేకుల కులంలో ఉన్నత విద్య అభ్యసించినా కేవలం ఇంటి పేరు మార్చుకు న్నందుకే తన కన్నా జూనియర్ కి కూడా ప్రభుత్వ ఉద్యోగం వచ్చి ముందుకు వెళ్తుంటే అతను పడ్డ కష్టం ఎవరికీ రాకూడదు అనుకుంటాం.

ఇక సయ్యద్ ఇంటి పేరు గలవల్లే అసలు ముస్లింలు అని వారే గొప్ప అని రెహమాన్ తండ్రి ఇస్మాయిల్ ఊర్లో వారికి దూరంగా పట్నంలో ఉండే రెహమాన్ ని పెంచుతాడు నిజానికి అతను పెరిగిన వాతావరణం అంతా ముస్లిం సమాజంలో అయినా తానొక దూదేకుకుల వాడినని చివరి దాకా తెలియదు ...ఉన్నత చదువు చదివాడని పిల్లని ఇచ్చిన బద్రుద్దీన్ చివరికి రెహమాన్‌ని ఎలా అవమానించాడు. పెద్దల సమక్షంలో విడాకులు కోరిన రెహమాన్ భార్య చివరికి ఎలా పశ్చాత్తాపం కలిగింది ...చివరిదాకా ఆద్యంతం చదివించారు

హిందూ సమాజంలో వెలివేతకి గురి అయినా బహుజన కమ్యూనిటీలు మతం మారిన గౌరవం దక్కక, రెండో తరగతి పౌరులుగా ఇంకా చెప్పాలి అంటే చాలా హీనంగా కడజాతి వారు అని అవమానించడం, అధ ముస్లిం లా పిలవబడటం ఎన్నో సంఘటనల్ని కళ్ళకి కట్టినట్టు వివరించారు. ఇంకా ప్రభుత్వం ముస్లింలలో వెనకబడిన వారికి ఇచ్చే రాయితీలు వీరికి వర్తిస్తాయి వీరికి వర్తించవు అన్నది బాగా చెప్పారు.

రెహమాన్ ఇటు జీవితంతో , పేదరికంతో పోరాడుతూ కూడా తన జాతి వాళ్ళు ఇలాంటి స్థితికి రావడానికి గల కారణాల్ని అన్వేషిస్తూ వెళ్తాడు. తన పూర్వీకుల చరిత్రని వాళ్ళు చేపట్టిన వృత్తులని తెలుసుకొని వాళ్ళ పేదరికాన్ని చూసి బాధపడతాడు. దూదిని ఏకే వారి బతుకులు ఇలా దూది పింజలై ఎందుకు తేలిపోతున్నాయి ..సరైన చదువు లేకపోవడం. తరాల నుంచి బానిసత్వంలో మగ్గడం ..అటు హిం దువుగా కాక ఇటు ముస్లింగా కాక సతమతం అవు తూ రెండికి చెడ్డ రేవడిలా ఎలా ఉన్నారో తెలి యజెప్పారు.

పవిత్ర గ్రంధాలలో మనుషులంతా సమానమే అనుకుంటూ కూడా తోటి మనిషి పట్ల వివక్షతని చూపడం మూఢ నమ్మకాలని ఎంతగా ఆచరిస్తున్నారో చదువుకున్నవాళ్ళు కూడా మనిషిని గౌరవించడం మానేసి సూటి పోటీ మాటలు అనడం రెహమాన్‌ని బాధిస్తాయి. డబ్బు ఉన్నవాడు ఏ మతంలో అయినా కులంలో అయినా ఒకేరకమైన మెంటాలిటీని కలిగి ఉండరాదు అన్నది రెహమాన్ మామగారి చూపించిన క్రూరత్వంలో చూడొచ్చు. పవిత్ర గ్రం ధాల్ని చదువుతూ కేవలం చెప్పు కోడానికే తప్ప ఆచరించడానికి అహం అడ్డు వచ్చే మనుషుల మనస్తత్వాన్ని చూసి బాధ పడతాడు.

దూది పింజెలు నవల మొదటి నుంచి చివరి వరకు చదివిస్తుంది .. పాత్రలు వాటి తీరుతెన్నులు మనల్ని కట్టి పడేస్తాయి. రెహమాన్, ఇస్మాయిల్, రెహమాన్ అమ్మ , వారి కోడలు, మత పెద్దలు సూచించిన పరిష్కారాలు ..సమాజంలో నెలకొని వున్నా వివక్షతలు ఇవన్నీ ఆలోచిం పచేస్తాయి. ఒకసారి చదవడం మొదలు పెట్టాక ఇక ఆసాంతం చదివిస్తుంది. దూదేకుల వారి జీవితాల్ని కాచి వడబోసి బాధల్ని ఇతివృత్తంగా తీసుకొని వచ్చిన ఈ నవల పదికాలాలపాటు గుర్తుండిపో తుంది. మంచి నవలని అందించిన సలీం గారికి అభినందనలు.

ప్రతులకు: అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలలో



-సి.హెచ్. పుష్యమి సాగర్
9010350317

## మణిపూసలు

మల్లె పువ్వులు తెలుపు
ఆవు క్షీరము తెలుపు
తెలుపు శాంతికి గుర్తగు
వెన్నెల వెలుగు తెలుపు

కాకి రంగుండు నలుపు
కోయిల రంగే నలుపు
కారు చీకటి రాత్రి
మనిషికి ముదము గొలుపు

కొలనులోని తామరలు
గగనములోని తారలు
జనుల కన్నుల విందుండు
గొలుపు ఆనందంబులు

పేద బ్రతుకు ఆరాటము
తిండి కొరకు పోరాటము
ప్రతి దినము చేసేడి
జీవన ప్రయాణ గమనము

ధర్మము ఆచరించాలి
అధర్మం వద్దెయ్యాలి
సన్మార్గ మందందరు
నిత్యము నడుచుకోవాలి

సుభోగాలకు రోగాలు
సిరి సంపదలకు పన్నులు
వయస్సు మీరిన వార్కి
వుంటాయి మరణ భయాలు

లంచాలకు మరగినారు
వంచనలు చేస్తున్నారు
తీపి మాటలు పలికి
నమ్మిన వారికి ముంచేరు

దొరల వలే వేషాలు
దొంగల వలే చూపులు
దోచుకునె వారున్నారు
జాగ్రత్త అమాయకులు

మోడు వారిన బ్రతుకులు
తిండికి లేవు మెతుకులు
రాత్రి ఆకలి కేక
వినిపించుకోని జనులు

అమ్మ పాల తీపిదనము
తెలుగు భాష గొప్పతనము
తెలుసుకోవాలందరు
ఆచరించాలందరము



–జాధవ్ పుండలిక్ రావు
9441333315

## గ్రహాంతరవాసులు

విశ్వంలో అనేక గలాక్సీలు, నక్షత్రాలుచ గ్రహాలు
మన భూమండలం వాటి ముందు చిన్న బిందువు
భూమ్మీద మాత్రమే జీవరాశి జీవవైవిధ్యం ఉన్నదా?
భూమ్మీద అత్రమే మేధోసంపత్తితో మనిషి ఉన్నాడా?
భూమి లాంటి గ్రహం మరొకటేందుకుండకూడదు?
శతాబ్దాల తరబడి మానవుని వేదిస్తున్న ప్రశ్నలివి
ప్రశ్నలకనుగుణంగా అనేకరకాలైన, ఆలోచనలు
అన్ని ఊహలే తప్ప
సౌర కుటుంబంలో మరెక్కడ జీవం మనుగడకు
ఈ నాటికి అనువైన వాతావరణం ఎక్కడలేదని తేలిన సత్యం
అప్పుడప్పుడాకాశంలో
కాంతివలయాలతో ఎగిరేపళ్ళాలను చూసి
ప్రపంచ వ్యాప్తంగా ప్రజలు, ప్రజ్ఞావంతులు శాస్త్రవేత్తలు
అవి ముమ్మాటికి గ్రహాంతరవాసుల వాహనాలే అని
అవునని కాదని రెండు వర్గాలుగా చీలిపోయారు
అభూత కల్పనలతో అద్భుత సాహిత్యం పుట్టుకొచ్చింది
ఎన్నో కథలు, నవలలు, సినిమాలు, టీవీల్లో ధారావాహికలు
అన్నిటిలో పాత్రలు రంగులతో విచిత్ర ఆకారంలో వింతజీవులు
భూగర్భవాసులతో భయానక గెర్రిల్లా యుద్ధాలు చేసినట్లు
భవిష్యత్కానికి చెందిన లెక్కలేని ఊహాత్మక కథనాలు
అద్భుత చిత్రీకరణలో అశేష ప్రజానీకం ప్రభావితమైంది
ఎగిరె పళ్ళాలపై ఏకంగా యుఫాలోజి విభాగం ఆవిర్భవించింది
శాస్త్రీయంగా అసాధారణ వాతావరణ పరిస్థితుల్లో
ఆకాశంలో రూపుదిద్దుకునే ఆకృతులే ఎగిరె పళ్ళాలు
ఎగిరెపళ్ళాలను గూర్చి ప్రజలు ప్రభుత్వాలు చేసిన ఊహలు
ఊహల ఊడలకు పుట్టిన గొలుసుకట్టు కథలే
సుమారు పదివేల కాంతి సంవత్సరాలకు పూర్వం
గ్రహాంతరవాసులు ఉండేవారని ఖగోళ శాస్త్రజ్ఞుల ఆవిష్కరణ
ఇది ఇటీవల తేలిన ఆసక్తికరమైన అంశం
శాస్త్రవేత్తలు గణిత నమూనాల ఆధారంగా
ఆనాటి వాతావరణ మార్పులను
వివిధ రంగాలుగా విభజించి
గ్రహాంతరవాసుల నాగరికత వికాసాలను అంచన వేసి
ఆ నాగరికత పతనానికి వినాశనానికి కారణం
అనూహ్య వాతావరణ మార్పులే అని తేల్చినారు
ఇప్పుడదే పరిస్థితి భూగ్రహంలో పునరావృతమవుతుందని
కాలుష్య సాగరమైన భూమండలం మృత్యువు ఒడిలో చిక్కి
నిస్సహాయంగ విలవిల్లాడక తప్పదని
హెచ్చరిస్తున్నారు.



– ఆచార్య పసుల వెంకటరెడ్డి
9849695603

## ఏమన్నది పలుకుతల్లి ?

ఏమన్నది ఏమన్నది?
రచయిత మది ఏమన్నది?
తన సృజనకు వెనువెంటనె
స్పందన కావాలన్నది
ఏమన్నది ఏమన్నది?
పాఠకహృది ఏమన్నది?
తనకు నచ్చు తీరు సృజన
వెలువడి రావాలన్నది
ఏమన్నది ఏమన్నది?
పత్రిక ఎద ఏమన్నది?
ఆకర్షించే రచనలు
అనిశం కావాలన్నది
ఏమన్నది ఏమన్నది?
పలుకుతల్లి ఏమన్నది?
శబ్దాలను సార్థకంగ
సరిగా వాడాలన్నది
ఏమన్నది ఏమన్నది?
మొహమాటం ఏమన్నది?
పొగడ్త మాత్రమే చాలని
పొంగిపోయి నిలుచున్నది
అల్పతుష్టి నాశ్రయించి
అదే చాలు చాలన్నది
ఆత్మతృప్తి లేని రచన
ఎవ్వరికోసం అంటూ
జ్ఞాని మనసు అంటున్నది
మౌని మనసు అంటున్నది
సంస్కరణం కావాలని
సరస్వతే అంటున్నది
లోకం అది వింటున్నది !!



–డా॥ అయాచితం నటేశ్వర శర్మ
సెల్: 9440468557

## వసివాడే "మొగ్గ"లు...

స్వేచ్ఛగా విహరించే బాల్యం
ఆంక్షల "చెరసాల"లో మగ్గుతోంది

ఆట పాటలతో "అలరారు" ప్రాయం
పుస్తక పుటల్లో "నెమలి"కై నలుగుతోంది

అమ్మ ఒడిలో "సేద"దీరు శైశవం
నాలుగు గోడల మధ్య శుస్కిస్తోంది

నాన్న వేలు పట్టి తిరిగే అడుగు
కాన్వెంట్ "కబేలా"కు తరలుతోంది

పచ్చగా చిగురించే లేత దేహం
బ్యాగుల "మోత"కు వసివాడుతోంది

కోయిల రాగాలై కూసే గొంతు
బట్టీ "పాఠాల" వల్లెవేస్తోంది

పరీక్షల "మెట్లు" ఎక్కలేక
మార్కుల "పట్టు" పట్టలేక
భయం నీడన "బతుకు" తెల్లారుతోంది

ఇంతగా...
బాల్యాన్ని "బలి" చేస్తున్నదెవరు?
భావి "తార"ల చిదిమేస్తున్నదేవరు?

ఇంకెవరు?
తమ ఆశా సౌదాన్ని పిల్లల
బతుకు పునాదులపై
నిర్మించ యత్నించే తల్లిదండులు

కాసులకు నోళ్లుతెరిచే
కార్పొరేట్ కర్కోటక రాకాసులు

ఇప్పటికైనా..
ఈ సంకుచిత "తత్వాలు" విడనాడితే...
ఈ విష సంస్కృతికి "చరమ" గీతి పాడితే...

బావితరం "బంగారు" బాటన పయనిస్తుంది
భారతావని సస్య శ్యామలమై విలసిల్లుతుంది



– కోడిగూటి తిరుపతి
9573929493

## అన్నదాత....!

పంటపొలంలన్ని
పసిబిడ్డ వలేను
కాయు కన్న తండ్రి
ఆహోరాత్రులును
అలసట లేకుండా
కాచే కాపరతడు

ధరణిని వరమడిగి
ధాన్యంబు రాశులను
కుప్పలుగ పోసినాడు
అవని తల్లి పుత్రులను
అలమటించకుండ
ఆకలి తీర్చే రైతుఅతడు

పచ్చనిపంటచేళ్ళను
పదిలంగా కాచినాడు
కరువు రక్కసి పీడ
అవనినతొలగించినాడు
తను పస్తులుండినా
పరమాత్ముడతడే

తన రుధిరంభును
చేమట చుక్కలుగా
సేద్యంబు పునినాడు
భూమాత తోడుగా
బంగారు పంటలతో
ఒడిని నింపినాడు

రైతు సల్లంగుంటే
దేశాన వెలుగులు
మద్దతు ధరలిచ్చిన
భూ రాజుకుకలుగుమేలు
రైతులు లేకున్న
రాజ్యంబు చీకటి

రైతు ప్రేమించుదేశం
రైతుస్నేహించులోకం
అధ్భుతంబులుగాంచు
అదే ప్రేమలోకం
ముసిరిన ఆకలి చీకట్లు
తొలగి కాంతులీను



–మొగిలి శ్రీనివాస్
9491746700

## సూరీడు అస్తమించాడు

సూరీడు ఎప్పుడు అస్తమించడు
అది మన భ్రమ
మొన్న శాశ్వత నిద్రలోకి జారుకున్న
ద్రావిడ సింగమూ అంతే
మనల్ని భ్రమలోకి తోసి తాను
తనలోకి ప్రవేశించాడు.

ఏ మనిషికైనా
కొంత విశ్రామమో, విరామమొ కావాలికదా?
పదునాలుగేళ్ల ప్రాయం నుండి ఎనుబదిరెండు దాక
ద్రవిడ ధనురకాన్ని మోగించిన శ్రామికుడికి!

పెరియార్ పల్లవిని
అన్నా చరణాన్ని
దక్షిణ భారతావనిలో అనుక్షణం వినిపించి
అలసిపోయాడు అంతే

మూలవాసిత్వానికి మారుపేరై
మళ్ళీ జన్మించడానికి
మనలోనుండి భౌతికంగా దూరం జరిగాడు
మనలోవుండి మన గమనాన్ని గమనించడానికి.

శక్తి ఎంతవున్నా
శరీరం సహకరించాలి కదా
ఈసారి నవయువ బాలుడిగా
మనకంటి నీరు ఇంకకముందే
నల్లపావురమై ఎరువు పిల్లలను
ముక్కున తీరుచుకొని ఎగిరివస్తాడు.

మెరీనా కెరటాలతో
తన గొంతును కలిపి
అరేబియా గాలులతో నిత్యం తన
సందేశాన్ని అందిస్తూనే ఉంటాడు.

ఓ పోరాట నిధీ
ఏ చోటా చూసినా నీ ప్రతిధ్వని
అయినా నీ రాక కోసం
కలాలు గళాలు అన్ని దిక్కులా
గాలిస్తూనే ఉంటాయి.



– అన్వేషి
సెల్: 9618241994

## బుల్లితెర బాగోతం.. !

భార్యపైనె అనుమానం
భర్త మీద అభిమానం
తాళి త్రెంచు ధూర్త భర్త
చూచె స్త్రీల మనోగతం.. ?

మాట్లాడితే పెనుభూతం
కొట్లాటలే బహు చిత్రం
పైశాచికానందమేను...
చూసే మనసులకె ఘాతం !

చూడచూడ బుల్లి తెరను
పాడుజేయు మేధ పొరను
ముందొక మాటలనటనలు
వెనుక తీతురు పాతరను.. !

బుల్లి తెర సెల్లు ఫోన్లు
ప్రేక్షకుల మదుల గన్లు
ఆచి తూచి వాడుకుంటె
జీవితమిక ఆటుపోట్లు.. !

యువతీ యువకులందరు
పెడదారి నందు పడుదురు
చెడిన యువతి యువకులంత
సమాజాని కెదురుందురు..!!!



–డాక్టర్ గన్నోజు శ్రీనివాసాచారి
8555899493

## జారుడు మెట్లు

కష్టాల కౌగిట్లో మగ్గితేనేగా
సుఖాల హృదయంలో చోటు
దక్కేది
సుడిగుండాలను చుట్టొస్తేనే కదా
దుఃఖం దరిచేరదు
కష్టాల్లో కన్నీళ్ళను తాగితేనే కదా
దుఃఖంలో దూర తీరాలకు
ప్రయాణం చేయవచ్చు
వడ్డించే వాడు మానవాడైతే
ఆఖరికి పోయిన అన్నీ దొరుకుతాయి
ప్రతి తల్లితండ్రి, తమ బిడ్డలపై
ప్రేమతో ఏకష్టం కలుగకుండా
అన్నీ పోగేస్తున్నారు.
పుట్టంగానే బంగారు ఊయల
కావాలంటె ఎలా?
మీ బిడ్డల్ని పట్టు పరుపుల
మీద పడుకోబెట్టే ఎలా?
జీవితమంటే అద్దం ముందు
నిలబడి అలంకరించుకోవడం కాదు.
ఏ రాపిడి లేకుండా వజ్రం ఎలా మెరుస్తుంది
ఏ శోధన లేకుండా సిరి (లక్ష్మి)
నీ దరికి ఎట్లా చేరుతుంది?
పునాది లేకుండ ఇల్లు నిలువది
పుణ్యానికి వచ్చిన డబ్బు నిలువదు
అందమైన చందమామమను కోరి
ఆకాశానికి నిచ్చెనలు కోరి
జ్ఞానాన్ని బోధించే గురువుల కొరకు శోధించాలి
మలినమైన మనస్సుతో శుద్ధిలేని శరీరముతో
జారుడు బండ మెట్లు ఎక్కి
దైవాన్ని దర్శిస్తాను అంటే ఎలా?
పవిత్రమైన భక్తి శ్రద్ధలుండాలి.



–కోణం పర్శరాములు
9959524585

## అమ్మా

జీవితంలో ఎందరు
ఎదురై ధైర్యాన్ని యిచ్చినా,
జాగ్రత్తగా చూసినా,
మంచిచెడుల గురించి చెప్పినా,
ఆదరించినా,
ఆప్యాయత చూపినా
అవ్వన్నీ
నీవు మాకు చూపించిన
ప్రేమానురాగాల ముందు
తక్కువే అమ్మా
నీవు లేని మేము లేము..
మేము తప్పు చేసినపుడు
కోపగిస్తే అవి మాకు
కుసుమాక్షంతలు అయి
మేము ఎదగడానికి ..
దారి చూపించాయి ...
ఇవ్వన్నీ ఎందుకు
అమ్మ చూపించే
ప్రేమనురాగాలను
మాటలలో వర్ణించలేనిది.
అమ్మ ప్రేమ ఊహలకి
అందనిది...



–అనిత
9494221927

## శారదా శతకం

చాతుర్యములో చతుర్భాషిణివై
చాక చక్యములో చరితవు నీవై
ప్రజ్వరిల్లి మకరంద మొలకించిన తల్లివై
శ్రీ జ్ఞాన సరస్వతి నీకిదే నావందనములమ్మా

ఆదిశక్తివై మమ్ము కావింపుతల్లి
ఆత్మ సృష్టిలో మమ్ము పాలింప రావ
నీ మోము నీ పద యుగ్మంబు లోన
శ్రీ జ్ఞాన సరస్వతి నీకిదే నావందనములమ్మా

శ్రీ లక్ష్మి వై నీవు సిరిని కురిపించు తల్లి
వరలక్ష్మి వై మమ్ము మేలు కొల్పిన తల్లి
సిరులు విరులై మమ్ము కాపాడ రావ
శ్రీ జ్ఞాన సరస్వతి నీకిదే నావందనములమ్మా

నమోః దేవి జనని నమః శివాయిణి
నమోః పాద యుగ్మాల నవ పాదంబు లోన
అఖిలవై అమ్మ వై నీ ఒడిలో లాలించే తల్లివై
శ్రీ జ్ఞాన సరస్వతి నీకిదే నావందనములమ్మా

జయ జయ భారత విజయాంబిక వని
నీ లలిత చరిత మాధుర్యముతోనే పదము
లు కూర్చి సకల సారమ్ము తెలిపే తల్లివై నిలిచిన
శ్రీ జ్ఞాన సరస్వతి నీకిదే నావందనములమ్మా

త్యాగ శక్తివి నీవయి సర్వ శాస్త్ర ములు నీవయి
భవ్య కాంతివి నీవయి దివ్య చరితవు నీవయి
మమ్ము బ్రోచు మా తల్లి కరుణామయివమ్మ
శ్రీ జ్ఞాన సరస్వతి నీకిదే నావందనములమ్మా



-వి.సంధ్యారాణి
సెల్ : 9542299500

## రేపటి భయం

మొన్న
చాలా చాలా బాగుంది
రాత్రిలేదు అంతా పగలే
నిన్న
పర్వాలేదు బాగుంది
చీకట్లు లేవు వెన్నెల కాసింది
నేడు
ఏం బాగులేదు అంతా చీకటి
వెలుగు మాయ అభివృద్ధి మాయ
అన్నీ అమావాస్య రోజులే
దేశంలో
ఖాళీకుండలు చప్పుడు వినిపిస్తుందని
నిపుణులంటున్నారు
మాటల మంత్రంలో అంతా మాయ
తూటాల శబ్ధంలో భయం నీడ
పేదరికం పెరిగిందని
ఖజానా ఖాళీ ఖాళీ అని
ఆర్థిక శాస్త్రజ్ఞుల అంచనా
అంతా వెదురు బొంగుమాట
మేడి పండు వేట
కాగితం పూల ఆట
బొమ్మలపై తూటా
వీరత్వం నశిస్తున్న మట్టిలో
మాటల గారడీ మాయ
రేపు ఏమవుతుంది?
భయం
భయంగా వుంది.



-సి.హెచ్. మధు
9949486122

## నిర్ణయం జరిగిపోయాక

మన చావు మనకు స్పష్టంగా తెలిసివస్తుంది
ఊపిరి మెల్లిమెల్లిగా చావు వైపు కదులుతుంటుంది
క్షణాలు నిమిషాలు గంటలు రోజులు
భారంగా మౌనంగా విషాదంగా కరిగిపోతుంటాయి
కళ్ళముందు కనిపించే ప్రతి దృశ్యం జాలిగా చూస్తుంటుంది
జారుతున్న చీకటి వెలుగుల్లో స్పష్టాతిస్పష్టంగా
బతుకు కొస మెరిసినట్టే మెరిసి మాయమవుతుంటుంది
మెరుపులు ఉరుపులు భయపెట్టలేవు
చివరి కోరిక ఏమిటని అడిగినప్పుడు
'చావూవూ...' అని బిగ్గరగా అరుస్తాం

చావు చుట్టూ గతస్మృతులు గిరగిరా తిరుగుతుంటాయి
గాలికి ఆకులు రాలినట్లుగా
ఊహల్లో స్మృతులు సాగిపోతుంటాయి
పగిలిన గాజుముక్కలవలె
స్వప్నాలు చెల్లా చెదురవుతుంటాయి
ఎక్కడెక్కడో విహరిస్తున్న ఆత్మలు చుట్టూ చేరుతాయి

చావు మెల్లిమెల్లిగా కదులుతూ
గొంతు చుట్టూ బిగుసుకుపోతుంది
మృత్యువు ముందు
స్వర్గం నరకం భ్రమలుగా నిలిచిపోతాయి

చావు మనకు నిజమైన నేస్తంగా దగ్గరవుతుంది
నేస్తాలు ఎంతమంది వచ్చి పలకరించినా గుండె నిండదు
నిండిన కన్నీళ్లతో చూపు మసకబారుతుంది
వెలుగు చీకటి అల్లుకుపోయి
మృత్యువు ముఖం మీద పెనుగులాడుతుంటుంది
నిర్లిప్తమైన పెదవి విరుపొకటి అలవాటవుతుంది

నా అనేవాళ్లెవ్వరూ కానరాక అంతా నావాళ్లవుతారు
నాటకం పూర్తయినా తెరదించేవాళ్లు కరువవుతారు
మ్యాచ్ ఫిక్స్ అయిన ఆటలాగే
జీవితం ముందుకుసాగుతుంది
ముఖులిత హస్తాల మధ్య
ఊపిరి ఇరుక్కుని గింజుకులాడుతుంటుంది

– కోడం పవన్‌కుమార్
9848992825

## తెలుగు మధుర భాష.. !

తెలుగంటే తేనెలూరు
తేటవూటజాలువారు
ప్రబంధ కావ్య కవనాల
వెలలేనివర్ణనతీరు.. !

పలువిధ ప్రక్రియల ఉషస్సు
నవకావ్య రచన తేజస్సు
పఠిత మదిన పరిమళించు
నవరసాల జ్ఞాన శ్రేయస్సు !

హాస్యవ్యంగ్య పేరడీలు
వికటకవిత గారడీలు
అలతి అలతి పదాలతో
అలరించే చమత్కృతులు!

నవ్య భావన నానీలు
సవ్య కవితమణిపూసల
ధ్వనిగర్భిత హేతువుల
అద్భుతరసప్లావితాలు !

కథకథానికలునవలలు
వ్యథలనువాస్తవికతలు
తెలుగుసాహితీయందున
వెల్లి విరియుని జనిత్యాలు!

తెలుగంటే తేటగీతి
వెలిగినట్టి ఆటవెలది
పద్యగద్య పఠనంతో
పరవశించు పఠితులమది!



-డాక్టర్ గన్నోజు శ్రీనివాసాచారి
9490145923

## అమ్మంటే

అమ్మంటే రెండక్షరాల పదం కాదు
అమ్మంటే రెండు జన్మల బంధం

అమ్మంటే ఆడుకునే బొమ్మ కాదు
అమ్మంటే తల రాత రాసే బ్రహ్మ

అమ్మంటే చీకటిలో వెలిగే దీపం కాదు
అమ్మంటే దీపాలను వెలిగించె మరో దీపం

అమ్మంటే నవమాసాలు మోసే బరువు కాదు
అమ్మంటే బరువు బాధ్యతలు నేర్పే గురువు

అమ్మంటే అంటే అజ్ఞానం లేని బొమ్మ కాదు
అమ్మంటే అంధకారాన్ని తొలగించే జ్ఞాన జ్యోతి

అమ్మంటే కొంగుచాటు ప్రేమ కాదు
అమ్మంటే విశ్వవ్యాప్త ప్రవాహ కీర్తి

అమ్మంటే ఒకనాడు తీర్చుకునే రుణం కాదు
అమ్మంటే జన్మజన్మల మర్చిపోలేని బంధం

అమ్మంటే పురిటి నొప్పుల కథ కాదు
అమ్మంటే పోరాట వీరుల గాథ

అమ్మంటే కడుపులో పెరిగే శిశువు కాదు
అమ్మంటే ఎందరికో నీడనిచ్చే తరువు

అమ్మంటే నడిచే బాటసారి కాదు
అమ్మంటే చైతన్యాన్ని నింపే మార్గదర్శి

అమ్మంటే రోజూ కనిపించే తల్లి కాదు
అమ్మంటే అనునిత్యం కొలిచే దేవత



-కమ్మరి శ్రీనివాస చారి
9177324124

## గుడిసెలో దేవతలు !!

వెచ్చని పూరి గుడిసెలోకి
చలి ఎలా పోగలదు --
పోకడగాక మంచు మంచుగా
గుడిసె పై గడ్డిలో
మంచు ముత్యాల కుప్ప !
గుడిసెలో అవ్వ అయ్య పిల్లలు
కలత లేని
కష్టించిన నిద్రతో !
లోకానికి అన్నదాతలు వీరు --
నాగలి ధరించిన దేవతలు వీరు
నేల గురించి ఋగ్వేదం
వల్లె వేస్తున్న ఎద్దులు
కొట్టం ప్రతి ధ్వనిస్తోంది
అంతా అక్షయ దృశ్యం !
గుడిసెను చూస్తే
వైకుంఠం ఎందుకు -
గుడిసె గుడి
గుడిసెలో మానవరూప దైవాలు
మన అందరి కోసం
వానలు పడాలని
చెరువులు నిండాలని
ఆకాశం కేసి తల ఎత్తి ప్రార్థనలు
చేసేది వీళ్లే మరి !!



– కందాళై రాఘవాచార్య
9908612007

## ఏకజీవి !

తీరికలేలేని జీవితాలలో
కోరికలు ఆవిరైపోతుంటే
కోరి పిలిచేవారే కరువయ్యారు !
ఉభయకుశలోపరి లేదు
విభవాలు ఎన్ని ఉన్నా తృప్తిరాదు
ఒక్క రూపాయికోసం అగచాట్లు ఆనాడు
లక్షలకు లక్షలే ప్రవాహాలు ఈనాడు !
భోగాలకు అంతులేదు
రోగాలకు అంతులేదు
త్యాగానికి విలువలేదు
అతిథిమర్యాద అటకెక్కింది
కలిసి ముచ్చట్లు కలలోనే !
తినే తిండికి అర్థం లేదు
కొనే వస్తువుకు మూల్యం సున్నా
అంతా గాలిలోనే ప్రయాణం
వీలు ఏమాత్రం లేని ప్రమోదం
దేనినీ తలచుకొనే పనిలేదు
ఎప్పటికప్పుడు కడిగేసుకోవడమే
మనిషికీ మనిషికీ మధ్య
అవసరాలేతప్ప ఆప్యాయతలు లేవు
చెప్పేది వినే పనిలేదు
విన్నా ఏ ఒక్కటీ అర్థం కాదు
కుటుంబం ఒక్కటే కానీ
వ్యక్తులు ఎవరికి వారే !
ఏదీ మిగలవలసిన పని లేదు !
మనిషి ఏకాకిగానే ఎన్నాళ్లైనా !!!



-డా॥ అయాచితం నటేశ్వర శర్మ
సెల్: 9440468557

## నడిస్తేనే...

నడువు!
ఇప్పుడు నీ ముందొక
సముద్రం ఉండొచ్చు
ఆవలివైపు
ఒక జన సంద్రం ఉంది
ఇప్పుడు నీ చుట్టూ
హోరెత్తే కెరటాలుండొచ్చు
ఆవలివైపు
విజేతల ప్రపంచం ఉంది
నీ నడక
చరిత్ర పుటల్లో నిలిచిపోయేలా నడువు!

నడువు!
ఇప్పుడు నువ్వొక
సూర్యుడి ఆనవాళ్ళేలేని
అరణ్య గర్భంలో ఉండొచ్చు
దారి తెలియదు
చుట్టూ దట్టమైన చీకటి
క్రూరమృగాల గాండ్రింపులు
చేతిలో కత్తో కర్రో ఉన్నప్పుడు
ఎవడైనా నడుస్తాడు
నీ చేతిలో నువ్వే ఒక ఆయుధం!
ముళ్లకంపల్ని నరుక్కుంటూ నడువు!
ప్రతి ముళ్ళ అరణ్యం ప్రక్కనా
ఒక పూలవనముంటుంది!

నడువు!
ఎడారిలో దారితప్పిపోయావు
దాహం ప్రాణాల్ని తోడేస్తోంది
ఎండమావులేవో ఒయాసిస్సులేవో
తెలియనంత దిగ్భ్రాంతి!
ఎడారి దాటేంతవరకూ నువ్వు ఒంటరివే!
కన్నీళ్లను దిగమింగుకుంటూ నడువు!

నడుస్తూ ఉండు!
సంద్రం నీ ముందున్నా
నీ చుట్టూ అరణ్యమున్నా
ఎడారిలో ఒంటరిగా మిగిలినా
నడుస్తూనే ఉండు!
నడిస్తేనే నిలుస్తావు
నడిస్తేనే గెలుస్తావు!



– సాంబమూర్తి లండ
9642732008

## పుస్తక సమీక్ష

# విలువైన విలువల "బహుమతి"






మనం ఏదైనా పోటీలలో పాల్గొన్నప్పుడు అందులో గెలిచినప్పుడు "బహుమతి" ఇస్తుంటారు. అదెంతో విలువైనవి ..అపురూపంగా దాచుకుంటాము అలాగే జీవితంలో మన చుట్టూ జరిగే వాటిని కథలుగా మలిచి సాహితి లోకా నికి "బహుమతి" రూపంలో రామాను జమ్మ గారు కథా సంపుటిని ఇచ్చారు ...మొత్తం పదిహేను కథలు ఉన్న ఈ సంపుటి లో అన్ని మానవ సంబంధాలకి పెద్ద పీట వేసినవే కావడం గమించవచ్చు ...

ఒక పనిమనిషి అయినా సుభద్రమ్మ తన ఒక్కగానొక్క కొడుకు కోసం ఎంతో తపిస్తుంది వాడి చదువుకోసం నాలుగు ఇళ్లల్లో పాచి పని చేస్తుంది. ఒకరోజు వొళ్ళు తెలియని జ్వరం తో బాధపడు తుంటే యజమానిని బతిమాలినా కరిగి పోదు. వైద్యం చేయించాలి అంటే ఐదు రూపాయలు కావాలి..ఇంటికి వచ్చి వెతుకుతుంటే భర్త బతికి ఉన్న రోజుల్లో పుస్తకం లో పెట్టిన ఐదు రూపాయలు కనిపిస్తుంది దాన్ని తీసుకొని వైద్యం చేయిస్తుంది. (శుభ శకునం)..దాచుకోవడం ఎంత ముఖ్యమో ఈ కదా తెలియ జేస్తుంది.

తల్లి మార్గంలోనే భాస్కర్ నడుచు కుంటారు కానీ ఇది భార్య కు నచ్చదు ఎంతసేపు తన వాదన పంతం నెగ్గించు కోవాలని చూస్తుంది కానీ ఏది ఎంతవరకు వెళ్తుంది అంటే భర్త తో తెగతెంపులు చేసేకునేదాకా. ఈ స్థితి లో ఎవరి వైపు మొగ్గాడు భాస్కర్?...చివర్లో భార్యని పుట్టింటికి దింపడానికి వెళ్తూ అమ్మతో "మన ఇల్లే మనకు స్వర్గసీమ" అని చెప్పి భార్య కళ్ళు తెరిపిస్తాడు. ప్రపంచం లో ఎంత విలాస భవంతిలో ఉన్న మన ఇంటికి సాటి ఉంది ఏది రాదన్నది నిర్వివాదాంశం. (మన ఇల్లే మన స్వర్గం). ..ఇద్దరి మధ్యలో జగడాలు పెట్టి వారిద్దరూ కొట్టుకుంటే చూసి ఆనందపడేవాళ్లు కోకొల్లలు ..వీళ్లంతా మన చుట్టూ తిరుగుతూనే ...మన వెనుక బోలెడు చాడీలు చెప్తూ ఉంటారు అమాయకురాలు అయినా మంగమ్మ మొఖం ఉదయం చూడటం వలన అనర్థాలు జరుగుతున్నాయని రంగమ్మ చేసిన దుష్ప్రచారాన్ని ఎలా మంగమ్మ తిప్పికొట్టగలింది ...నలుగురిలో మంగమ్మ "కీలెరిగి వాత" పెట్టడం తెలివైన పనే...మన బాగు కోరేవాళ్ళు ఎప్పుడు మంచివారి...అలా కాకుండా ఇలా చాడీలు చెప్పి అవమానపరిచేవాళ్లకు కీలెరిగి వాత పెట్టాల్సిందే (కీలెరిగి వాత)... పెద్దవాళ్ళు ఎప్పుడు మంచే చెప్తారు మనం వాళ్ళు చెప్పినదాన్ని చాదస్తం అని కొట్టి పారెయ్యకుండా పాటిస్తే మనకి మంచి జరుగుతుంది కాదు అంటే "సరళ ప్రయాణం" లా తయారు అవుతుంది శర్మ భార్య సరళ సంక్రాంతి కి వాళ్ళ పుట్టింటి కి వెళ్తాను అని చెప్తుంది కనీసం వారికి ఉత్తరం వేయమని అత్తగారు చెప్పినా వినదు ....శర్మ ఆఫీస్ కి వెళ్లడం సరళ వాళ్ళ ఊరికి వెళ్తే వాళ్ళు వేరే ఊరికి వెళ్లడం సాయంత్రం కల్లా మరల ఇంటికి రావడం (సరళ ప్రయాణం)..అనుభవజ్ఞులు చెప్పింది వినడం చాలా వరకు మేలు చేస్తుంది ..

చిన్న పిల్లల మనసు చాలా సున్నితం ఒకసారి దెబ్బతింటే కోలుకోవడం చాల కష్టం ...కన్న తల్లి చనిపోతే సవితి తల్లి వంచన బతుకుతున్న సూర్యానికి ఎదురైనా ఇబ్బంది ని , కష్టాలని కి, తన తల్లి చూపుతున్న వివక్షత ని చూసి తట్టుకోలేని చంద్రం చివరికి ఎలా తన తల్లి కి గుణపాఠాన్ని నేర్పాడు, సూర్యం మంచితనం ..చంద్రం ప్రేమ ఆ సవతి తల్లి లో పశ్చాత్తాపాన్ని కలిగించింది ..బయటకూడా అలానే ఉంటె ఎంత బాగుండు (పశ్చాత్తాపం )... వేళా కానీ వేళా లో చెప్పి చెయ్యకుండా ఇంటికి వెళ్తే ఇంట్లో శ్రీమతి కర్ర పుచ్చుకొని తరుముతుంటే ...పాపం భర్త ఏమి చేస్తాడు ..ఆ క్రమం లో శ్రీమతి ఇచ్చిన బిరుదు ని తలుచుకొని సంతోషపడతాడు (అవతారం)...

పొలం పనులు చేసుకొని బతుకు ఈడ్చే తండ్రి రఘు కి కొంత డబ్బు ఇస్తాడు కానీ రఘు అతని స్నేహితుడు అమ్మకి బాగోలేదని అప్పు గా రఘు నుంచి తీసుకుంటాడు ..రఘు భార్య ప్రసవిస్తుంది దానికి డబ్బులు అవసరం అయితే తండ్రి నిలదీస్తాడు ...కానీ ఇవ్వలేకపోతాడు కానీ రఘు స్నేహితుడు మాత్రం గుర్తుంచుకొని తీసుకు వస్తాడు ..."మనవడు పేచీ" కథలో అవసరానికి ఆదుకోవాలన్న మంచి సందేశం చూడొచ్చు

మనదైన ఒక కుటుంబం ఉంటె ఎంత బాగుటుంది. పేదరికం లో కొట్టుమిట్టాడుతూ దూరంగా పారిపోయి బాగా బతకాలనుకుంటాడు సుదర్శనం ...అలా పారిపోయి గోవిందరావు అనే పెద్దవారి ఇంట పనికి కుదురుతాడు. అందరికి తలలలో నాలుకలా మెలుగుతాడు చివరికి రావు కూతురినే చేసుకుంటాడు. పెళ్లి కి ముందు తాను అనాధ అని చెప్తాడు. కానీ భార్య అయినా సుజాత అన్నయ్య పట్ల చూపిన వాత్సల్యం వలన కళ్ళు తెరుచుకొని అప్పటిదాకా చెప్పిన అబద్దాన్ని మామగారికి భార్య కి చెప్పి సొంత కుటుంబాన్ని పరిచయం చేస్తాడు. (వాత్సల్యం) ... మన పరిస్థితుల వలన ఎప్పుడు అబద్దం చెప్పకూడదు దానివలన చాల నష్టపోతాం అని తెలుస్తుంది

సినిమా చూడమన్న భార్య కోరిక ని తీర్చడానికి భర్త చేయని ప్రయత్నం లేదు ...అయినా ఎప్పుడు ఎదో ఒక ఇబ్బంది ..తనపై వోట్లు వేయించుకొని ఆఫీస్ నుంచి వచ్చే భర్త కోసం ఎదురు చూసిన శశి కి ఎదురయినా అనుభవం ఏమిటి ...? ...తీరా సినిమాకి వెళదామనుకున్న సమయానికి శశి తమ్ముడు దిగబడతాడు ..వదిన నగల కోసం సినిమా ప్రోగ్రాం ని కాన్సుల్ చేసి వెళ్తుంది ఈ లోగా భర్త ఇంటికి వచ్చి తాళం చూసి పక్కనవాళ్లని అడిగి పార్క్ కి వెళ్తాడు అంతకు ముందే మాట తప్పినందుకు భర్త కి చివాట్లు వేసింది అవకాశం దొరికింది కదా అని తనకి అదే చెప్తాడు "తప్పనిసరి " పరిస్థితుల్లో ఎవరైనా ఏమి చేయలేరు అని ..చివరికి ఇద్దరు సెకండ్ షో కి వెళ్లడం తో శుభం గా ముగుస్తుంది (తప్పనిసరి)

పాకాల రామానుజమ్మ గారు రాసిన బహుమతి కదా సంపుటి ఎంతో ఆలోచింపచేస్తుంది మానవ సంబంధాలు ఆర్థిక సంబంధాలు గా మారినా ఈ కాలం లో మనిషి విలువ, ప్రేమ అభిమానం ..ఇవన్నీ మనిషి జీవితం లో తప్పనిసరిగా ఉండాలని మనిషి విలువతో జీవించాలని చాటి చెప్పే కథలే ...పెద్దల పట్ల గౌరవం, ప్రేమ , వాత్స్యాలం ఉండాలని....తోటి మనిషి పట్ల సహృదయత కలిగి ఉండాలని విలువల్ని రంగరించి రాసిన కథలు ....మంచి కదా సంపుటి ని అందించిన రామానుజమ్మ గారికి అభినందనలు.!!

ప్రతులకు: శ్రీమతి వి. శ్రీలక్ష్మి
2-1-421, ఫ్లాట్ నెం.202
సైనీ నిలయం వీధి నెం.4
నల్లకుంట,
హైదరాబాద్-44
సెల్: 9241 08893



-సి.హెచ్. పుష్యమి సాగర్
9010350317

## గెలుపు

కళ్లల్లో నక్షత్రాలు
బుర్రల్లో భావ ప్రకంపనలు
ఉద్వేగం నరనరాల్లో
ఉత్తేజం రక్తసిరల్లో
ఉరికించే వేడి ఆవేశం
గర్జించే వాడి ఉన్మాదం
ఒకొక్కటే ఎక్కే మెట్లను
ఒక్కటిగా దాటిన పొగలు
జనమందరు ఒక వైపున్నా
గెలుపన్నది నాదేనన్నా
బాధల్లో ప్రేరణ వెతికా
గెలుపే శ్వాసగా నా బతుకు.



– డా॥ మానస్ కృష్ణకాంత్
9491928384

## ప్రథమ ప్రాధాన్యాలు

శతాబ్దాలుగా
తరతరాల జీవితాలను వడబోసి
నీతి కోవిదులు నీతులనెన్నో బోధిస్తూన్నా
ఎందరో ఆదర్శాలను
ప్రబోధిస్తూన్నా
ఈ లోకం-ప్రథమ ప్రాధాన్యాలు
ధనమూ, అందానికే!

### ప్రమాదాలు-అవకాశాలు

వెంట్రుకవాసిలో
కేవలం ప్రమాదాలే కాదు
మళ్ళీ మళ్ళీ రాని
సువర్ణావకాశాలు సైతం
తప్పిపోతూంటాయి!



– రఘువర్మ
9290093933

## జీవన పరిమళం...

కాలం కలిసి రాలేదనో..
కష్టాలు చుట్టు ముట్టాయనో...
కన్నీటి "సంద్రం"లో కొట్టుకుపోతే ఎలా?

కల "నిజం" కాలేదనో...
అనుకున్నది దక్కలేదనో...
నిరాశ నిస్పృహల్లో కుమిలిపోతే ఎలా?

గౌరవం దక్కలేదనో...
గెలుపు "దరి" చేరలేదనో...
నిట్టనిలువునా కూలిపోతే ఎలా?

నమ్మినోళ్లు వంచించారనో...
అయినోళ్ళు దూరం చేశారనో...
పొగిలి పొగిలి దుఃఖిస్తే ఎలా?

ఇక్కట్ల "చీకట్లు" కమ్ముకున్నాయనో...
బతుకు "దారులు" మూతపడ్డాయనో
ఉన్నఫళంగా "తనువు" చాలిస్తే ఎలా?

మిత్రమా!
స్పందనంటూ లేకుంటే...
చేతనమంటూ రాకుంటే....
బండ రాయికి నీకు "తేడా" ఎక్కడిది

గత జ్ఞాపకాల నెమరు వేస్తూ
ఉన్నచోటనే "గిరి" గీసుకు కూర్చుంటే...
సుప్తావస్థ జీవికి నీకు "భేదం" ఎక్కడిది

జీవన క్షణాల నిర్వీర్యం చేస్తూ
చాదస్తపు "చలి" మంటల కాస్తుంటే...
అల్పునికి నీకు "అంతరం" ఎక్కడిది?

ముందుగా...
అజ్ఞానాన్ని త్యజించి
వికాస "జ్యోతి"ని వెలిగించు
నిస్తేజాన్ని తిరస్కరించి
చైతన్య "జ్వాల" రగిలించు
భయాన్ని బహిష్కరించి
బతుకు "పోరు"కు సిద్ధపడు

తొలుత.... అడ్డంకుల
"పల్లేర్లు" పరిహసించొచ్చు గాక!

కడకు....
బతుకు "పూల"తోటై పరిమళిస్తుంది



-కోడిగూటి తిరుపతి
9573929493

## పుస్తక మొగ్గలు

విశ్వవిజ్ఞానానికి నెలవులౌతూనే
శాస్త్ర సాంకేతికానికి నిఘంటువులైతాయి
శాస్త్రీయ జ్ఞానసుధలు పుస్తకాలు

అనుభవానికి ఆధారలైతూనే
అనుభూతికి నిదర్శమై నిలుస్తున్నాయి
అనుభవ అనుభూతుల కల్పతరువు పుస్తకం

పుస్తకాలు ఎంత పాతవైపోయినా
జ్ఞానానికి పునాదిరాళ్ళు అవుతాయి
పుస్తకాలు మనిషికి జ్ఞానబండాగారాలు

చెయ్యితో పట్టుకునే పత్రాలవుతూనే
ప్రపంచాన్ని కండ్లముందు దించుతాయి
పుస్తకాలు విశ్వాన్ని చూపించే తొవ్వ

పుస్తకాలు నిత్యం రోడ్లపై దర్శనమిస్తూనే
విద్యార్థుల్లో సృజనాత్మకతకు పదును పెడతాయి
పుస్తకాలు జ్ఞానాన్ని వెదజల్లే కుసుమాలు

పుస్తకాలు జ్ఞానానికి మూలమవుతూనే
విజ్ఞానజ్యోతికి చమురు అవుతాయి
జ్ఞాననిధికి ఆలయాలు పుస్తకాలు

పుస్తకాలు పూర్వచరిత్రను వివరిస్తూనే
నూతన సాహిత్యానికి మార్గదర్శకమవుతాయి
పుస్తకాలు గతానికి వర్తమానానికి వారధులు

మన జ్ఞానానికి చైతన్య దీపికలవుతూనే
మంచిమిత్రులుగా మిగిలిపోతున్నాయి
పుస్తకాలతో సంబంధం పూర్వజన్మ సుకృతం

పుస్తకాలు అరిగి చినిగిపోతూ ఉన్నా
మన విజయానికి తోడ్పడే సాధనలౌతాయి
పుస్తకాలు ఎన్నడు వాడని ఆత్మీయనేస్తాలు

ఉద్యమాలకు ఊపిరిలూదుతూనే
నిరంకుశత్వాన్ని ఎదిరించే పిడికిళ్లవుతాయి
పుస్తకాలు విప్లవచైతన్యపు నినాదాలు

మూఢనమ్మకాలను సదా వ్యతిరేకిస్తూనే
శాస్త్రీయ విజ్ఞానానికి బీజాలేస్తాయి
పుస్తకాలు మనిషిని మానవత్వం వైపు నడిపిస్తాయి



– ఉప్పరితిరుమలేష్
9618961384

## మొగ్గలు

తొలిగురువు మేనమామ
తోడునీడలో సాహితీ తీర్థం
పుచ్చుకొని అక్షరసేద్యంచేశాడు
**'కవితాకళానిధికపిలవాయి'**
లింగమూర్తి

వైద్య,జ్యోతీష్యనిపుణులుగా
ఆరితేరిన వంశానుగ్రహంతో
కవీశ్వరుడిగా ఎదిగాడు

**సాహితీ సిద్ధహస్తుడ్తు**
కపిలవాయి లింగమూర్తి

బంగారు ఆభరణాలకుమెరుగులుదిద్దుతూనే
మది, మనుచరిత్రపై
మలుపు తిప్పి మహాకవిని చేసింది
**'సాహితీచరిత్రలో రాజసం'**
కపిలవాయిలింగమూర్తి

తాళ్ళపత్రాల,ఆలయాల,తావు
చరిత్రల కథలకు జీవంపోశాడు
**'నిత్య అధ్యాయనశీలి'**
కపిలవాయిలింగమూర్తి

పద్య,గద్య రచనలు రంజింపజేస్తూ,
జగతికి విజ్ఞాన భాండాగారాన్ని అందించాడు
**'తెలంగాణసాహితీ'**
'దురంధరుడు లింగమూర్తి'

తెలుగుభాష మాధుర్యా పటిమ పంచి,
పెంచి ఎందరినో ఉత్తమ పండితులుగా మలిచాడు
**'విద్యబుద్ధులునేర్పిన'**
'గురుశిరోమణి లింగమూర్తి'

అక్షరాలను ఆణిముత్యాలుచేసి
శతకగ్రంథకర్తగా ఆజన్మాంతం కవనం సాగించాడు
**'తెలంగాణతొలి డాక్టరేట్'**
కపిలవాయిలింగమూర్తి

జానపద,బాలసాహిత్యం,
కీర్తనలనందిస్తూ,విమర్శ,
పరిష్కారకర్తగా అవతరించాడు
'తెలంగాణ సాహితీ'
మాణిక్యం లింగమూర్తి-**కపిలవాయి వెంకటేశ్వర్లు**
9494019898

## కైతికాలు

మొదట శ్రవణం చేయాలి
మననం చేయాలి
తర్వాతనే మనము
ఆలోచన చేయాలి
వారెవ్వా ఓర్పు
పనిలో నుండును నేర్పు

పెండ్లికి కావాలిప్పుడు
వర కట్న కానుకలు
ఇవి లేకుంటే కావు
కన్యల పెండ్లిళ్లు
వారెవ్వా కట్నం
ఇవ్వకుంటే జరుగదు లగ్గం

పెండ్లి లకు దూబారా
ఖర్చులు చేస్తున్నారు
ధనవంతులైన వారు
పేదలు జంకుతున్నారు
వారెవ్వా పెండ్లిళ్లు
పేదల బాధలు

పెండ్లి వికృత రూపం
ధరించింది నేడు
పేద కుటుంబాలకు
దెబ్బ తీస్తున్నది నేడు
వారెవ్వా పెండ్లి తంతు
ఆడంబరాలకు పోకపోతే మేలు



-జాధవ్ పుండలిక్ రావు
9441333315


**నేటినిజం** చందా వివరాలు

ప్రతి వారం ప్రచురిస్తున్న 'సాహితీ కెరటాలు' గల 'నేటినిజం' 260 సంచికలు + పోస్టల్ ఛార్జీలు కలుపు కుని **5** సం॥రాలకు రూ.**700/-**, **10** సం॥రాలకు రూ **1200/-** మీ చందాను 'నేటినిజం' తెలుగు దినపత్రిక పేరిట ఎం.ఓ. లేదా డిడిగానీ, ఈ క్రింది అడ్రసుకు పంపగలరు.

'నేటినిజం' దినపత్రిక, ఎస్ఆర్‌టి-74,
జవహర్‌నగర్, హైదరాబాద్-500 020.

గత సంచిక తరువాయి..

**మృణాళిని: మొదటి నుండి మీలో వచ్చిన పరిణామం గమనించారా కవిగా ? ఇప్పుడున్న కవులతో కూడా పోటీపడుతున్నారు. మీరు రాసినప్పటి కవులు వేరు ఇప్పుడు రాస్తున్నప్పుడు ఉన్న కవులు వేరు. మీలో రకరకాల చైతన్యాలు కలిశాయి. చాలా సూక్ష్మమైన చైతన్యాలు ఉన్నయ్ ఇప్పుడు. స్థూలం కాదు. fragmentation ఎక్కువైంది కదా! అందుకని సూక్ష్మమైన చైతన్యాలు అంటున్నాను. అంటే వీళ్లందరితో కూడా మీరు ఎలాగా సామరస్యంగా ఉండగలుగుతున్నారు. ఉంటున్నారు, పోటి ఫీలవుతున్నారా?**

**గోపి :** నేను పోటీగా ఫీలవను. కొత్తది ఎదురైతే పులకించిపోతాను. అయ్యో! ఈ సమస్య మన కాలంలో లేదు. వీళ్లకీ సమస్య వచ్చింది అనుకుంటాను. నేను దాన్ని గుణాత్మకంగానే చూస్తా, రుణాత్మకంగా చూడను. కాకపోతే ఎక్కడన్నా సహనం లోపిస్తే కొంచెం ఓపికపట్టవచ్చు కదా అనిపిస్తది పెద్దవాడిగా. ఏం లేదు క్లాసు, క్యాస్ట్ అస్తిత్వ వాదాల మీద వ్యతిరేకత ఏమీ లేదు. ఇప్పుడు మన దేశంలో వర్గం, వర్ణం ఇవి రెండు బోలెడంత మథనానికి లోనైన రెండు రంగాలు. వీటిని ఒక గణితంలాగ గీతలు గీసి చూపించడం కష్టం. ఒక సంక్లిష్టత ఉంటుంది వీటిని మనం సంక్లిష్టంగానే అర్థం చేసుకోవాలి. its a complex society. దాన్ని మార్చలేం. కాబట్టి దాన్ని అర్థం చేసుకునే శక్తి కూడా మనకు ఉండాలి. మనలాగ లేరు కాబట్టి వాళ్ళను మన విలువల సంపుటితో కొలువకూడదు అని నా ఉద్దేశం. నా బావుకత ఎప్పుడు జాగరూకంగానే ఉంటుంది.

**మృణాళిని : మీకు ఎవరితోను పోటిలేదు.**

**గోపి :** పోటి లేదు. నా సమకాలిన కవులతో కూడా నేను ఎప్పుడు పోటి అనుకోను. వాళ్ళ మీద అసూయ పడడం ఉండదు. పోటి అనేది అనవసరం. అసలు కవిత్వంలో పోటి అనేదేముంది. నీలెక్క నేనుండను, నాలెక్క నువ్వుండవు. నా నేపథ్యం వేరు, నీ నేపథ్యం వేరు.

**మృణాళిని : ఇన్నేళ్ళుగా రాస్తున్నా రోజు కవిత్వం రాయడానికి అంత ప్రేరణ ఎక్కడనుండి వస్తుందని ?**

**గోపి :** మృణాళిని గారు! మన జీవితం ఎంత పెద్దదంటే ఎంత రాసినా వొడువదు.



ఈ జీవితంలోనే నా చిన్నప్పటి నుండి చూసిన అనుభవాలను తలుచుకుంటే ఇంకా రెండు జన్మల పాటు రాసినా వొడువనంత ఉంటుంది. మనసులో ఒక నిరంతర వేదన. ఒక చిన్నపిల్లవాడు ఒక ఊరు నుండి ఇంకో ఊరికి డబ్బుల కోసం అప్పుకు వెళ్లాడనుకోండి, ఇంట్లో పేదరికాన్ని అనుభవించిన పిలవ్లాడు ఉన్నాడనుకోండి నేను పేదరికాన్న బాగా అనుభవించాను. అది ఒడవనంత అనుభవం. ఎంత తీసినా వస్తనే ఉంటది, చెలిమె తీసినట్టే. మౌలికంగా జీవితం నాకు అర్థమైంది. మనం ఎన్ని అందమైన మాటలు మాట్లాడినా ఎన్ని ఏం చేసినా కూడా, అక్కడ పైసల్లేకపోవడం అంటే ఏమిటి, ఏదైనా తినాలనిపిస్తుంటది, పకోడి, జేబులో డబ్బులు లేవు అనుకోండి, నేను దాన్ని చాలా కవితల్లో రాశాను. 'పైసల్లేవు' అని, అట్లా ప్రతిదాన్ని నేను పోలుస్తాను. నా బాల్యం లాంటిదే చాలా మంది బాల్యం. అట్లాని సిల్వర్ స్పూన్ తో పుట్టిన వాళ్ళను నెటెటివ్ గా చూడను. వాళ్ల పరిస్థితులతో చూస్తా, వాళ్ళ పరిస్థితుల్లో చైతన్యంగా ఉన్నారా, నటిస్తున్నారా అని గమనిస్తాను తప్ప మన తోటి కంపేర్ చేసుకుని ధనవంతులంతా చెడ్డవాళ్ళని సాధారణీకణ చేయను.

**మృణాళిని :మీరు విమర్శ కూడా రాశారు. రెండు వ్యాస సంకలనాలు కూడా రాశారు. మీరు విమర్శించిన వాళ్ళందరు ఎంపిక చేసుకున్న వాళ్ళు పాపినేని శివశంకర్, ఓల్గా, ఇలా కొంతమంది, నారాయణ రెడ్డి గారి మీద మంచి పుస్తకమే రాశారు. అలా మీరు విమర్శను ఎలా చూస్తారు.**

**గోపి :** విడిగా మీరు ఇంతకు ముందు అన్నట్లు మనకు ఇష్టమైన వాళ్ళ సాహిత్యం మీద ఎక్కువ స్పందిస్తాం. నారాయణ రెడ్డిగారి సాహిత్యం మీద, ఓల్గా సాహిత్యం మీద, ఓల్గా మంచి కవయిత్రి. నేను ఎప్పుడూ అంటుంటాను ఆమె కాల్పానిక సాహిత్యం కోసం కవిత్వాన్ని త్యాగం చేసింది అని. అలా ఆమె కవిత్వం అంటే నాకు చాలా ఇష్టం. అలా ఇష్టంతో రాసినవి కొన్ని, విశ్వవిద్యాలయ సదస్సుల్లో రాసినవి కొన్ని, ఏది రాసినా నేను కొంత కష్టపడి, తెలుసుకొని ఏదన్నా ఒక విషయం మీద కొత్తగా చెప్పాలనే తపనతో రాశాను.

**మృణాళిని : నారాయణ రెడ్డి గారి ప్రభావం మీ జీవిన శైలి మీద ఉంటే ఉండొచ్చు. కాని కవిత్వ మీద ప్రభావం ఆయన ఎంత ఉంది.**

**గోపి :** లేదు

**మృణాళిని : మీరు రాయడంలో కనిపించదు అందుకే అడుగుతున్నా?**

**గోపి :** నా కవిత్వ ప్రవేశానికి ఆయన ఒక గొప్ప తొలి ప్రేరణ. ఆయన నా జీవితానికి ఒక గైడ్. ఒక వేగు చుక్క నా జీవితానికి. నా కవిత్వం నా అనుభవం లో నుండే రాశాను. కాబట్టి ఆయనలాగ రాయడానికి అవకాశం లేదు. ఆయనే అనేవాడు **'నీది వేరు నాయనా'** అని తొలి రోజుల్లో గేయాలు కొన్ని రాశాను. దాంట్లో నారాయణ రెడ్డి



గారి ప్రభావం కొంత ఉండొచ్చు. శబ్దాల మీద అప్పట్లో ఆయన ప్రభావం ఉంది కాని భావాల మీద గురువు గారి ప్రభావం లేదు. జీవితం మీద ఉంది. నేను ఆయన నుండి నేర్చుకున్న ఔచిత్యం, సహృదయత, సహనం ఇట్లాంటివి ఆయనను చూసి నేర్చుకున్నాను. టీచర్ గా కూడా బాగా కష్టపడి పోవాలి అని' ఇట్లాంటి ప్రభావం ఉంది జీవిత పార్శ్వాల మీద.

**మృణాళిని : కవిత్వాన్ని నేర్పించవచ్చా మీ దృష్టిలో చెప్పండి . కవిత్వం కోసం వర్క్ షాప్ లు నిర్వహిస్తారు కదా? కవిత్వం నేర్పిస్తే వస్తుందా ?**

**గోపి :** నేర్పించలేము కాని వారిలో ప్రతిభ ఉంటే మేల్కొల్ప వచ్చు.

**మృణాళిని : మీరు నానీల ద్వారా చాలా మందిని మేల్కొలిపారు కదా! మీరు వాటిని సరిదిద్దుతారా. మౌలికంగా ప్రతిభ ఉంటే?**

**గోపి :** మౌలికంగా ఉంటేనే. కొందరిలో కవితాత్మకత ఉంటుంది. కాని వాళ్ళకు భయం అన్నమాట. ఇదేదో కొందరే రాసేది. మనకు చాతగాదు అనుకుంటారు. అట్లాంటి వాళ్లకు ఈ శిబిరాల్లో నలుగురి మాటల్తో వాళ్ళను కంపేర్ చేసుకొని మనలాంటి వాళ్ళు చాలా మంది ఉన్నారే. అనుకుని ధైర్యం తెచ్చుకుంటారు. శిబిరాలకు హజరైన వాళ్లు మంచి కవులు అవుతారని కాదు గాని కొందరు జాగృతం కలగడానికి అవకాశం ఉంటుంది. అది పూర్తిగా భ్రంశకార్యతత్పర్యుల గోష్టికాదు. అది కొంత ప్రయత్నం చెయొచ్చు. కార్ఖానాల్లాగ కవులను ఉత్పత్తి చేస్తుందని కాదు.

**మృణాళిని : మీ కవితలలోంచి మీకు ఇష్టమైన కవితలు కొన్ని వినిపిస్తారా?**

**గోపి :** చదువుతాను. ఇవి కాలాన్ని నిద్రపోనివ్వను కావ్యంలోనివి. సాహిత్య అకాడమి అవార్డు గ్రంథంలోని మూడు కవితలు. ఇవి చాలా చోట్ల చదివాను కూడా. అందులో ' రొట్టె' రొట్టె గురించి నాకు చాలా మంచి అనభవం ఉంది. మీకు తెలుసు మీరసింగ్ సూఫి కవి. సాహిత్య అకాడమి వైస్ ప్రెసిడెంట్ గా చేశాడు. పంజాబ్ నాబాసభలో దీన్ని చదివాను ఆయన అదివిని ముగ్ధడైపోయి నా రూమ్ కు వచ్చి అరుణతో Your husband is a great poet అన్నాడు. ఇది పంజాబ్ లో అందరికి చాలా నచ్చింది. అది రొట్టెల దేశం కదా?










**రొట్టె**

'రొట్టె ఆకాశం నుండి ఊడిపడదు
భూగర్భ సారంలోంచి
చెమట బిందువులు మోసుకొచ్చిన
ఆకలి స్వప్నం రొట్టె.
ఇది మెట్టపొలాల మట్టిరాగానికి
చేతులు వేసే తాళంలోంచి
నడిచొచ్చిన కాంతి చక్రం.

తెల్లారటమంటే
మా ఇంట్లో రొట్టె సూర్యుడు ఉదయించటమే
పిండి ఐదువేళ్ళ సందుల్ని అలంకరిస్తూ
అరచేతి రేఖల్ని ఆప్యాయంగా ముద్దాడుతూ చేసే
శ్రమ స్పర్శా సిద్ధాంతం రొట్టె.
పిసికేటప్పుడు
ఏ పొర ఏ ఆకృతిదాలుస్తుందో
వ్యక్తమవుతూ మాయమయ్యే
అసంఖ్యాక విన్యాసాల పర్యావసానం రొట్టె.

అమ్మ ముద్దను పిసుకుతుంటే
ఆమె తన చేతుల్తో
మా కడుపులను నిమురుతున్నట్టుండేది.
రొట్టె పెంకమీదికి చేరగానే
అందరం చుట్టూ మూగేవాళ్ళం
సలాకితో రొట్టెను కాలుస్తుంటే
ఆమె శ్రద్ధగా రొట్టెమీద
మమకారం మహాకావ్యాన్ని
లిఖిస్తున్నట్టుగా ఉండేది.
అప్పుడప్పుడు రొట్టెమీద
నీళ్ళతో పాటు కన్నీళ్ళు కూడా కురిసేవి.
మాకవేవి తెలియవు
రొట్టెంటే రొట్టే!
రొట్టె మీద ఓనమాలు దిద్దుకున్నాం
రొట్టెను ఏనాటికీ మాతలలపైన
సూర్యుడిగా ధరించాం.

రెండో కవిత **బొంత.**

మా రంగు రంగుల బొంతకు
ఏ విమల్ డిజైన్లూ సాటిరావు,
మాఅమ్మ పదిరోజుల పాటు దీనిని కుట్టడం,
ఇంకా నాకు గుర్తుంది.
పాతబట్టలను పోగేసుకొని,
మా అమ్మ ఏర్పరచిన,
సమన్వయ వ్యవస్థ ఈ బొంత.
గత వర్తమానాలు, ఆమె చేతుల్లో
అలవోకగా అతుక్కుపోయేవి.

దీనిమీద కూర్చుంటే
మ్యాజిక్ చాపలా ఎగిరిపోయేయి
జ్ఞాపకాల దీవులకు చేరేస్తుంది.
ఈ బొంత మీద పడుకున్నప్పుడల్లా,
అమ్మా, అమ్మమ్మా, అక్కా అందరి వొడిలో
ఏకకాలంలో సేదదీరినట్టుంటుంది.
మా పిల్లలు బొంతను నాకంటే
నాకని పోట్లాడుకుంటారు.
ఈ తంతుని చూచి పరుపులు చిన్నబోతాయి.
తరం నుండి తరానికి పరుచుకున్న
వారసత్వ వాత్సత్యం మా బొంత,

దీని కుట్లు ఊడిపోయినప్పుడల్లా,
మా ఆవిడ సూదీ దారంతో ప్రత్యక్షం
అప్పుడామె, కరవాలం పట్టుకుని,
కాల దేవతతో యుద్ధం చేస్తున్నట్టగా
ఉంటుంది.

వేసవిలో ఇది హంసతూలికాతల్పం,
చలికాలంలో నులువెచ్చటి దుప్పటి,
నిద్రంటే నాకు బొంతే
ఇది నాకు ప్రసాదించిన స్వప్నాల్లో
ప్రాక్తన మానవీయ పరిమళాల్ని చవిచూశాను.
హిమాలయ పర్వతాన్ని కౌగిట్లో ఇముడ్చుకున్నాను.
గంగానదిని చెంబులో బంధించాను,
భూగోళాన్ని మందు బిళ్లలా మింగాను,

బొంతను పిట్టగోడ మీద ఆరేస్తే,
ఆ ఇంట్లో పసిపిల్లలున్నట్టు లెక్క.
ఒక్కసారి తడిసిందా ఐదారురోజుల దాకా
బొట్లు బొట్లుగా దు:ఖపూరితగా మారిపోతుంది.
గమనించం గాని,
బొంత మన శ్రామిక జన సంస్కృతికి ప్రతీక.
మమకారాల సుతారపు అల్లికకు పతాక.

**కాలాన్ని నిద్రపోనివ్వను,** ఇంతకుముందు
మీరు అన్నారు కాలం గురించి అడిగారు
కాలపత్రం మీద ,
కాలాతీత సిరాతో రాస్తున్నాను,
సిరా పేరు కన్నీరు,
ఎంత ధూమ సలిల మరుత్తులైనా
మేఘం మేఘమే.
సైన్స్ ఎన్ని వాస్తవాలు చెప్పినా
ఒక్క చినుకు వల్లే
అది కవిత్వం అయ్యింది.

గాయపడిన పక్షికి
ఆకాశం మరింత అనంతమవుతుంది.
పక్షి ఊరుకుంటుందా
దాని అంతు చూడడానికే రెక్కలు సారిస్తుంది.
ఆకాశం ఎక్కడో లేదు,
శూన్య హస్తాల్లో ఉంది.
లుప్తమవుతున్న అనుబంధాల్లో ఉంది.
భావ రహిత సంభాషణల్లో ఉంది.

ఆకాశం భూమికి వేసిన సంకెళ్ళను ఛేదించడానికి,
మనిషి నిలబడుతాడు,
కాలాన్ని నిద్రపోనివ్వకపోవటమే
జీవితం,
మరి సముద్రం సంగతి!
సముద్రం ఎన్నటికీ చచ్చిపోదు,
ఓ క్షణం అలా స్తంభిస్తుంది.
మళ్ళీ పొంగులెత్తి
చంద్రున్ని అందుకోవాలని చూస్తుంది.
చంద్రున్ని ఎన్నిసార్లు రుద్దినా
అరిగిపోదు.
వెన్నెల గంధం వస్తూనే ఉంటుంది.
చుక్కలను ఎన్నిసార్లు తడిమినా విరిగిపోవు
పువ్వులుగా విచ్చుకుంటాయి.

మనిషి పరిమళించడమే జీవితం,
కాలపత్రం మీద
కాలాతీత సిరాతో రాసినప్పుడు,
ఏర్పడిన చిత్రం పేరు
మనిషి.


























3

(ఐ డ్రీమ్ తెలుగు, యూట్యూబ్ చానెల్ కోసం ప్రముఖ కవి ఎన్. గోపి గారితో ఆచార్య సి. మృణాళిని జరిపిన ముఖాముఖి)

'మృత్యువు ఊసుతెచ్చి భయపెట్టకండి నన్ను, కాలం రహస్యం తెలిసినవాణ్ణి కాలానికి భయపడతానా?' అని నిర్భయగీతిని ఆలపించిన కవి, మానవీయ కవి కాలం కంటే మనిషి గొప్పవాడు అని తీర్మాణించిన కవి ఆచార్య ఎన్. గోపి గారు.

'అమ్మ రుణం తీర్చుకోవాలంటే అమ్మకు అమ్మాయి పుట్టాలి' అనే సూక్తుల లాంటి అనేక కవితా పంక్తులు ఆచార్య గోపిగారి కవిత్వంలో మనకు దర్శనమిస్తాయి.

1967 నుండి ఈనాటి వరకు అవిశ్రాంతగా కవిత్వం రాస్తూ 24 కవితా సంపుటాలను ఆయన ప్రచురించారు. అంతేకాదు కవిత్వానికే తన సాహిత్యం అంకితం చేయకుండా చాలా అద్భుతమైన యాత్రా చరిత్రలు, గొప్ప పరిశోధన, విమర్శ అన్నీ ప్రకటించారు. అంతే కాకుండా 'నానీలు' అనే సరికొత్త ప్రక్రియను కూడా సృష్టించారు. బహుముఖ ప్రజ్ఞాశాలి అయిన ఆచార్య ఎన్. గోపి గారే ఈనాటి అక్షర యాత్ర అతిథి.

**మృణాళిని :వృద్ధోపనిషత్తు ఎందుకు రాయాలనుకున్నారు.**

**గోపి :** నాకు కాలాన్ని నిద్రపోనివ్వను, జలగీతం, నానీలు, ఇవి ఎంత తృప్తి ఇచ్చినయో వృద్ధోపనిషత్తు కూడా అంత తృప్తి నిచ్చింది. ఏడెనిమిదేళ్ళుగా 2011 నుంచి నేను వృద్ధాప్యం గురించి చాలా పుస్తకాలు చదివాను ప్రపంచ సాహిత్యంలో వృద్ధాప్యం అనగానే కొంత భయం మొదలవుతుంది. Eropean conntries కు సంబంధించిన పాత కవిత్వం చదివితే వాళ్ళు 50 ఏండ్లకే వృద్ధాప్యం వచ్చిందనీ తెల్లవెంట్రుక రాగానే దానిమీద కవిత్వం, దిగులు పడడం ఇవన్నీ కవిత్వ రూపంలో వచ్చినయి, యాభై ఏండ్లకే మన తల్లిదండ్రుల కాలంలో కూడా ముసలితనం వచ్చినట్లు భావించేవారు. వాళ్ళకు బాల్య వివాహాలు ఉండేవి. ఇప్పుడు అంతర్జాతీయంగా వృద్ధాప్యం అంటే 65 యేండ్లు. ఇప్పుడు ఎనబై దాకా జీవిస్తున్నరు. ఆ చాలా మంది వృద్ధులను చూసా. నేను గొప్ప వృద్ధులున్నరు. వాళ్ళకు దీని ప్రభావం లేదు శరీరమే కదా మనస్సు కాదు. కొందరు ధైర్యవంతులు, నాకిప్పుడు ఏమనిపిస్తుందంటే కొందరు పిల్లల దగ్గర ఉండట్లేదు అది కొంచెం దురదృష్టకరమైన నా పరిస్థితి. అమెరికా లాంటి దేశాల్లో అక్కడున్న పిల్లలు కూడా వాళ్ళకుండే బిజీ వల్ల, పొద్దున పోయి రాత్రికి వచ్చిన వాళ్ళకే వాళ్ళ కాలం వాళ్ల జీవితానికి వాళ్లే సరిపోవట్లేదు. వాళ్ళను తప్పుపట్టడం లేదు. కాని please have little concern about elders అంటాను లేకపోతే మీ గమ్యం కూడా ఇదే కదా! ఇవి వాళ్ళ దృష్టికి తేవాలని మొదటి సగం, మిగిలిన సగం 'ముసలితనం చాలా విలు వైంది, చాలా precions అని, ధిషణా పటుత్వం ఉంటుంది దీనిలో కాబట్టి ఇప్పుడు ఏం మాట్లాడినా అనుభవాన్ని గర్భీకరించుకొని వస్తయి మాటలు. స్వార్థం తగ్గుతుంది. కాబట్టి నలుగురికి మనం మేలుజేయగలిగిన ఒక వైశాల్యం కూడ మన మనస్సుకు ఏర్పడుతుంది. మొదటిసగం కరుణ, వృద్ధాప్యం ఎంత దయనీయమో తెలిపేది. మిగిలిన సగం ఉత్సాహం, వీరం, వృద్ధ వీర మనుకోండి. మన ధర్మ వీరం లాగా, యుద్ధ వీరం లాగ ఏమంటే వృద్ధులు ఎట్లా బ్రతకాలంటే **'నా వృద్ధాప్యం ముందు నీ యవ్వనం ఎంత'** అన్నట్లుగా సవాలు చేసేంత ఉత్సాహంగా బతకాలని. మృత్యువే కదా ఇప్పుడు కాకపోతే రేపు తథ్యం ఏమిటంటే బాధపడకుండా ఉండాలి. మన ఆకాంక్ష. అది వారి అదృష్టం. మానసికం అనేది మన చేతుల్లో ఉంటుంది. కొంత Management కూడా. వృద్ధాప్యంలోని అనేక పొరల్ని నేను చూశాను. నేను కూడా 70 లోకి ప్రవేశానికి దగ్గరగా ఉన్నాను శరీరం మనతో మాట్లాడుతున్న భాషలో కూడా తేడా ఉంది. అందుకని నేను రాయాలని చాలా Material నేను సేకరించాను. ఒక స్నేహితునితో **'నేను రాద్ధామ నుకుంటున్నాను'** అన్నాను. **'ఇప్పుడే రాయండి'** ఇంక నాలుగు రోజుల అయితే మీరు రాయలేరు. ఎందుకంటే ఇంత శక్తి ఉండదప్పుడు అన్నాడు. అప్పటికి అనుభవం ఉంటుంది కాని రాయాలనే శక్తి, జ్ఞాపకశక్తి ఉండదు. అంటే అప్పుడు కూర్చొని రాశాను. వాళ్ళ Responses కూడా విన్నాను. భయమేస్తుందా, ఉత్సాహం కలుగుతుందా అని, దాన్ని ఎలా స్వీకరిస్తున్నారని చాలా మంది వృద్ధులు అనే మాట చెప్పగానే దాని అర్థానికి సంతోషించారు. వృద్ధులు అంటే వృద్ధి చెందినవారు అని అర్థం. వృద్ధుడు అంటే ముసలివాడు అని కాదు. ఆ వృద్ధి అనేక రకాలుగా వయస్సులో కావచ్చు, అనుభవంలో కావచ్చు, స్ఫూర్తిలో గావచ్చు. ఆ వృద్ధి చెందడం అవునా ఆ అర్థం వుందా వృద్ధుడికి అని చాలా ఉత్సాహాన్ని పొందడం గమనించాను. 'వృద్ధోపనిషత్' అనువాదం హిందీలోకి శాంత సుందరి గారు చేశారు, అలాగే ఇంగ్లీష్ లోకి అల్లాడి ఉమా, శ్రీధర్ చేశారు. అవి తొందరగా వస్తే ప్రపంచం అంతా తెలుస్తుంది. ఎందుకంటే ఇది విశ్వ జనీనమైన స్పందన. నాగరికత వేరు వేరుగా ఉన్నా, ఉపరితలాల్లో భేదాలు ఎన్నున్నా అంతరంగంం అట్టడుగున అంతర్గత మౌలిక స్పందనలు ఒకటే అని తెలుస్తుంది.

**మృణాళిని : దాదాపుగా మీ కవిత్వం అంతట్లోను కనిపించే సూత్రం అదే. అందరికీ అన్వయించే ఒక అనుభూతి స్పందనే మీ కవిత్వం. అందుకే మీరు ఒక పరిమితిలో లేరు. మీరెప్పుడు ఒక వైశాల్యంమే. అలాగే వేమన మీద అంత చేశారు. పోతులూరి వీరబ్రహ్మం మీద కూడా మీరే చేస్తే బాంగుండేదని వ్యాఖ్యాలు కూడా వచ్చాయి. కొంత వరకు చేశారు. తర్వాత ఎందుకు కొనసాగించలేదు?**

**గోపి :** సారస్వత పరిషత్తులో పోతులూరి వీరబ్రహ్మం మీద ఉపన్యాసం ఇచ్చాను. నెలనెల ఉపన్యాసాలకు పిలిచేవారు. అప్పుడే మొదటి సారి మిమ్మల్ని అక్కడ చూశాను. అప్పుడు ఎం.ఏ చేస్తున్నట్లుంది మీరు. అప్పుడు రంగనాథాచార్యులు గారు దాన్ని నిర్వహించేవారు. వీరబ్రహ్మం మీదనా ఉపన్యాసం నచ్చింది అందరికి. నేను దాని గురించి కూడా బాగా కష్టపడి పరిశోధన చేశాను. అందులో పోతులూరి వీరబ్రహ్మాన్ని నమ్మకాల చుట్టూ ఏర్పడిన దేవుడిలా కాకుండా ఒక మానవతామూర్తిగా, చేతి వృత్తులు దెబ్బతిన్న కాలంలో వృత్తికారుల్లో ఏర్పడిన నైరాశాన్ని పటాపంచలు చేయడానికి ఆయన ఆవిర్భవించిన దార్శనికుడిగా ఆయనను సంభావించాను. నేను ఆయనను బాగా చదివాను. ఆ పంచాణం వారి చరిత్ర ఆ నేపథ్యాన్ని బ్రహ్మంగారి సాహిత్యాన్ని పరిశోధనాత్మకంగా అన్వయించి చూపాను. అందరికి నచ్చింది. మెచ్చుకున్నారు. గోవింద పదాలు ఉన్నాయి, ఐతిహ్యాల్లో ఉండే సోషియాలజి, సామాజిక శాస్త్రాన్ని కూడా గమనించాను. కాబట్టి నాకు ఒక గొప్ప మానవతా మూర్తిగానే కనిపించాడు. పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి, ఒకానొక యుగ సంధిలో ఆయన చేతివృత్తుల వారందరినీ ఒక బరోసాను కల్పించాడు. ఒక విరాట్ మూర్తిగా చూశాను.

**మృణాళిని: కవిత్వం గురించి రాస్తూ మహా తెలివైన వాళ్ళెప్పుడు మంచి కవులు కాలేరు కవి కావడానికి కొంచె పసితనం, అమాయకత్వం ఉండాలి అన్నారు మీరు. మంచి స్టేట్ మెంట్ అనిపించింది నాకది. దాని గురించి మీరేమంటారు.**

**గోపి :** ఏం లేదు. మనందరికి తెలిసిందే. మనందరం కూడా కొంత Innocence, కొంత పసితనం, అమాయకత్వం లేకపోతే మనలో స్పందనలు ఎక్కడినుండి వస్తాయి. రావు గదా! బాగా తెలివితేటలు ఉన్న వాడు manupulate చేయవచ్చు లేకపోతే కీర్తికి దగ్గరి దార్లు వెతుక్కోవచ్చు. వీళ్ళను కవిత్వం కరుణించదు. అని నా నమ్మకం. తెలివైన వాళ్ళంటే తెలివిహీనులు అని ఆ అర్థం కాదు, తెలివి తేటలు అంటే అవసరం కంటే ఎక్కువ తెలివి తేటలు అని అర్థం. Intelligent గా clever గా ఉండేవాళ్ళు అక్కర్లేదని భావం. creative timeలో వాడు రుషి, pramotion సమయంలోనే వస్తయి తెలివితేటలు నా ఉద్దేశ్యం అదే. మీలాంటి విదుషీమణులు గుర్తిస్తే నేను ఎక్కువ సంతోషిస్తా. నేను ఇం టర్వ్యూలు యాభై ఏళ్ళలో ఎన్నో సార్లు ఇచ్చాను. మృణాళిని చేస్తున్న అనుభూతి వేరుగా ఉంది. ఎందుకంటే నేను మాట్లాడేది అర్థమయ్యే ఒక వ్యక్తి. ఎదురుగా ఉన్నట్లు ఫీలవుతున్నా.

**మృణాళిని : అది నేను నా అదృష్టంగా ఫీలవుతున్నా? మీరు కవులు. మాములుగా నేను కవిత్వం రాయలేదు కాబట్టి మీలాంటి వాళ్ళును నేను ఇంటర్వ్యూ చేయడం**

**గోపి :** పూర్వం తెలుగు విశ్వవిద్యాలయంలో మనం కలిసి పనిచేయడం అక్కడ నేను మీ క్రియా వైశాల్యం, ఆచరణ శుద్ధిని చూసినవాణ్ని కాబట్టి అది కూడా ఒక కారణం అయి ఉండొచ్చు. తర్వాత నేను ఏదైనా మాట్లాడొచ్చు she will take care of me అనే నమ్మకం కూడా కావచ్చు.

**మృణాళిని : అంటే మీలా కవిత్వాన్ని మాత్రమే నమ్ముకుని ఉండే జీవితాలు తక్కువగా ఉంటాయి . చాలా మంది వివిధ రంగాలలోకి వెళ్ళిపోతారు. మీరు నిజంగా చాలా పదవులు నిర్వహించారు. అవి కూడా విజయ వంతంగా నిర్వహించారు. అయినా కూడా మౌలికంగా మీరు కవిగా ఉండిపోగలిగారు. అది ప్రత్యేకత. ఆ ప్రత్యేకత బయటకి తీసుకురావడానికి ప్రధానమైన అంశం.**




**గోపి:** మొండితనం. మా తల్లిదండ్రులదీ అంతే. మౌలికంగా ఉండే సంవేదన పోలేదు. ఆ credit మా తల్లిదండ్రలకే ఇస్తాను నేను. మా తల్లిదండ్రులు మమ్మల్ని పెంచిన ప్రేమ. అబద్ధం ఆడకపోవడం ఇట్లాటివి కొన్ని విలువలు నేర్పారు. వాళ్ళకు చదువులేకున్నా. ప్రేమ మరీఎక్కువ. మా తండ్రిగారు పిల్లలందరం తిన్న తర్వాతనే ఆయన తినేవాడు. మా అందరికి పక్కలు పరిచి పోయి బోంచేసేవాడు. చిన్నపిల్లల్ని పెంచే టప్పుడు చాలా మందిమి వీటిని మరచిపోతుంటాం. ఇవి వాళ్ళ మోటర్ డెవలప్ మెంటుకు తోడ్పడతాయి.జీవితాంతం గుర్తుంటాయి. గుర్తున్నయ్ నాకు. బహుశా అందుకే కవిత్వం, ఏదన్నా పాట వినగానే ఎవో కొత్త మాటలు నాకు తట్టడం అందుకే.

**మృణాళిని : మీరు పాటలు కూడా రాసి ఉండవచ్చు. మీ సంవేదనను బట్టి చూస్తే మీరు గేయ ప్రక్రియను అంత సీరయస్ గా తీసుకున్నట్టు లేదు.**

**గోపి :** నేను అటుగా పోలేదు. అంటే నేను ప్రయత్నం చేయలేదు. సినిమా పాటలు రాయాలని ఎప్పుడు అనిపించలేదు. హైదరాబాద్ లోనే ఉన్నాను. ప్రయత్నం చేస్తే రాయగలిగేవాన్నేమో. గేయాలు కూడా రాశాను కాని బహుశా నేను ఒకరు చెప్పినట్లుగా రాయలేనేమో. flexible mind కాదు నాది. నాలో ఒక పద్ధతి ఉంది అనుకుంటా. సృజన పేరుషం కూడా కావచ్చు.



అక్షర సముద్ధరణ
**- డా. గిన్నారపు ఆదినారాయణ**
తెలుగు లెక్చరర్, ఇందిరా ప్రియదర్శిని ప్రభుత్వ డిగ్రీ కళాశాల, హైదరాబాద్. 9949532456.



కుటుంబ సభ్యులతో...



సినీ దర్శకులు బాపు జయంతి సందర్భంగా ఆయన దర్శకత్వం వహించిన పౌరాణిక చిత్రం సంపూర్ణ రామాయణంను ఆదివారం త్యాగరాయగాసభ కళాదీక్షితులు వేదికలో శిఖరం ఆర్ట్ థియేటర్ ఆధ్వర్యంలో ప్రదర్శించారు. ఈ సందర్భంగా యువ లఘు చిత్ర దర్శకులు శ్రీనివాస్ బాసుపల్లికి బాపు ప్రతిభా పురస్కారాన్ని అందజేశారు. ముఖ్య అతిథిగా ప్రసిద్ధ సినీ దర్శకులు రేలంగి నరసింహారావు విచ్చేశారు. అతిథులుగా సామాజికవేత్తలు డా॥కె. కృష్ణవేణి, శ్రీనివాస్, వైఎస్సార్ మూర్తి, వై.రాజేంద్రప్రసాద్ హాజరయ్యారు.

## ‘ది జర్నీ ఆఫ్ ఏ జర్నలిస్ట్’ పుస్తకావిష్కరణ



రాజకీయ నాయకులు, జర్నలిస్టుల మధ్య అనుబంధం ఉంటుందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, మాజీ ఎంపీ కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు. సీనియర్ పాత్రికేయుడు కంభాలపల్లి కృష్ణ వృత్తిలో పాతికేళ్ల అనుభవాల సమాహారం ‘ది జర్నీ ఆఫ్ ఏ జర్నలిస్ట్’ పుస్తకావిష్కరణ సభ ఆదివారం పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయంలోని ఎన్టీఆర్ కళామందిరంలో నిర్వహించారు. కార్యక్రమంలో కృష్ణ సోదరుడు చంద్రన్న, సుందరయ్య విజ్ఞాన కేంద్రం కార్యదర్శి ఎస్. వినయ్‌కుమార్, సంపాదకులు కె. శ్రీనివాస్, శివప్రసాద్, శేఖర్‌రెడ్డి, టీసాట్ సీఈఓ ఆర్. శైలేష్‌రెడ్డి, ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ తాడూరి శ్రీనివాస్ కృష్ణ పాల్గొన్నారు.


తెలంగాణ సాహిత్య అకాడమి
నెల పొడుపు సాహిత్య సాంస్కృతిక వేదిక
సంయుక్త ఆధ్వర్యంలో
నాగర్‌కర్నూల్ జిల్లా సాహిత్య సమాలోచన
కపిలవాయి లింగమూర్తి ప్రాంగణము
ప్రారంభ సభ
తేది : 24, 25 డిసెంబర్ 2019, మంగళ, బుధవారం
వేదిక : సి.యన్. రెడ్డి సేవా సదన్, నాగర్‌కర్నూల్.
ఆహ్వానము
తేది : 24-12-2019 మంగళవారం ఉ॥ 10 గం॥ల నుండి 1-00 గం॥ల వరకు
సభాధ్యక్షులు : వనపట్ల సుబ్బయ్య అధ్యక్షులు నెలపొడుపు సాహిత్య సాంస్కృతిక వేదిక
ముఖ్య అతిథులు : గౌ॥ శ్రీ సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి గారు వ్యవసాయ శాఖామాత్యులు, తెలంగాణ
గౌ॥ డా॥ నందిని సిధారెడ్డి గారు అధ్యక్షులు, తెలంగాణ సాహిత్య అకాడమి
గౌరవ అతిథులు : గౌ॥ శ్రీ మర్రిజనార్ధన్ రెడ్డి గారు శాసనసభ్యులు, నాగర్‌కర్నూల్.
గౌ॥ శ్రీ గోరటి వెంకన్న గారు ప్రజాకవి, హంస, కాళోజి అవార్డు గ్రహీత
గౌ॥ శ్రీ నాగపూరు విష్ణు గారు అధ్యక్షులు, జిల్లాగ్రంథాలయసంస్థ, నాగర్‌కర్నూల్
విశిష్ట అతిథులు : గౌ॥ శ్రీ సి. భాస్కర్ రావు గారు విశ్రాంత అధ్యాపకులు, తెలంగాణ వికాస సమితి
గౌ॥ శ్రీ కందికొండ మోహన్ గారు గౌరవ అధ్యక్షులు, నెలపొడుపు సాహిత్య సాంస్కృతిక వేదిక
ఆహ్వానము : నీరటి బాలీశ్వర్ కార్యదర్శి, నెలపొడుపు సాహిత్య సాంస్కృతిక వేదిక
వందన సమర్పణ : యం.డి. ఖాజా కార్యవర్గ సభ్యులు, నెలపొడుపు సాహిత్య సాంస్కృతిక వేదిక


## నటుడు శ్రీరాం లాగు మృతి

ముంబయి,డిసెంబర్18(ఆర్ఎన్ఎ): థియేటర్ ఆర్టిస్ట్, నటుడు డాక్టర్ శ్రీరామ్ లగూ(92) బుధవారం తెల్లవారుజామున తుదిశ్వాస విడిచారు. పుణెలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శ్రీరామ్ కన్నుమూశారని కుటుంబ సభ్యులు వెల్లడించారు. థియేటర్ ఆర్టిస్ట్‌గా సినీ రంగంలో ప్రవేశించాడు. అనంతరం బాలీవుడ్, మరాఠీ చిత్రాల్లో నటించి మంచి పేరు తెచ్చుకున్నాడు. మరాఠీ నాటకాలకు దర్శకత్వం వహించడమే కాకుండా ఇఎన్‌టి సర్జన్‌గా ప్రజలకు వైద్యసేవలందించారు. శ్రీరామ్ లగూ మృతిపట్ల కేంద్రం మంత్రి ప్రకాశ్ జవదేకర్ సంతాపం తెలిపారు.


ఆహ్వానం





పాలమూరు సాహితి ఆధ్వర్యంలో
ప్రముఖ పరిశోధకులు డా॥ ఉందేకోడు రత్నయ్య గారు అనువదించిన
రత్న గీతికలు (ఉర్దూ గజళ్ళకు తెలుగు అనువాదం)
పుస్తకావిష్కరణ సభ
కార్యక్రమం
సభాధ్యక్షులు : శ్రీ వి.మనోహర్ రెడ్డి గారు, ప్రముఖ న్యాయవాది
ముఖ్య అతిథి & పుస్తకావిష్కర్త : శ్రీమతి స్వర్ణసుధాకర్ రెడ్డి గారు జిల్లా పరిషత్ చైర్మన్, మహబూబ్‌నగర్
విశిష్ట అతిథులు : శ్రీ జలజం సత్యనారాయణ గారు, ప్రముఖ కవి, అనువాదకులు
శ్రీ బుర్రి వెంకట్రామారెడ్డి గారు, ప్రముఖ న్యాయవాది
ఆత్మీయ అతిథులు : డా॥ ఎస్.టి.సురేందర్ రావు గారు విశ్రాంత జాయింట్ డైరెక్టర్, ఉన్నత విద్యాశాఖ, హైద్రాబాద్
శ్రీ కె.శ్యాంసుందర్ గారు ఆలిండియా స్టాఫ్ అసోసియేషన్ - ఎస్.బి.హెచ్., అధ్యక్షులు
సమీక్షకులు : శ్రీ ఇరువింటి వెంకటేశ్వర శర్మ గారు, ప్రముఖ కవి
సమన్వయం : డా॥ భీంపల్లి శ్రీకాంత్ గారు
తేది : 22-12-2019 ఉ॥ 10 గం॥లకు
వేదిక : జిల్లా పరిషత్ సమావేశ మందిరం, మహబూబ్‌నగర్.
అందరూ ఆహ్వానితులే


# రంగారెడ్డిలో విస్తరిస్తున్న పరిశ్రమలు

### టిఎస్ ఐపాస్‌తో త్వరగా అనుమతులు

### నగరం చుట్టూ విస్తరించి ఉండడంతో అనుకూలం

రంగారెడ్డి,డిసెంబర్18(ఆర్ఎన్ఎ): పరిశ్రమల స్థాపనకు రంగారెడ్డి జిల్లా కేరాఫ్ అడ్రస్‌గా మారింది. పరిశ్రమల ఏర్పాటులో జిల్లా ప్రత్యేకతను చాటుతోంది. హైదరాబాద్‌ను ఆనుకుని ఉండడంతో భూముల లభ్యత కూడా ఉండడంతో పరిశ్రమలు ఇక్కడే ఏర్పాటుకాక తప్పడం లేదు. అదేవిధంగా బహుళజాతి కంపెనీలు విస్తృతంగా వెలుస్తుండటం నిరుద్యోగులకు వరంగా మారింది. హైదరాబాద్ మహానగరం శివారు చుట్టూ మన జిల్లా విస్తరించి ఉండటం, అనువైన రవాణా వ్యవస్థ కలిగి ఉండటంతో పెట్టుబడుల వరద పారుతోంది. ముఖ్యంగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన టీఎస్ ఐపాస్' పాలసీ.. పరిశ్రమలకు స్థాపనకు ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ఇది అమల్లోకి తీసుకురావడంతో మహర్దశ పట్టింది. త్వరితగతిన అనుమతులు జారీ చేయడం, నెల రోజుల నిర్దిష్ట సమయంలో అనుమతులు మంజూరు, ఆన్‌లైన్‌లో విధానంలో దరఖాస్తు చేసుకునే సౌలభ్యం ఈ పాలసీతో కలిగింది. దీంతో పారిశ్రామికవేత్తలు.. ఎన్నో అనుకూల అంశాలు ఉన్న రంగారెడ్డి జిల్లాలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపారు. ఆయా కేటగిరీల్లో మొత్తం రూ.46 వేల కోట్ల వ్యయంతో 935 పరిశ్రమలు నెలకొల్పేందుకు ఆన్‌లైన్ దరఖాస్తులు అందాయి. వీటిద్వారా 7.64 లక్షల మందికి ఉపాధి కల్పించాలన్నది లక్ష్యం. ఇందులో ఇప్పటివరకు 690 పరిశ్రమలు తమ ఉత్పత్తులను ప్రారంభించాయి. రూ.13,385 కోట్ల పెట్టుబడులు జిల్లాకు వచ్చాయి. ఇప్పటివరకు 1.95 లక్షల మందికి ఉపాధి లభించడం విశేషం. పరోక్షంగా మరో 50 వేల మంది వరకు జీవనోపాధి అవకాశాలు లభించాయి.

మహానగరం చుట్టూ జిల్లా విస్తరించడం, రవాణామార్గాలు అనువుగా ఉండటం.. తదితర సానుకూలతలు పారిశ్రామికవేత్తలను ఆకర్షిస్తున్నాయి. ఒక్కో మెగా కంపెనీలు వేల కోట్లు పెట్టుబడులు పెడుతుండగా.. మరికొన్ని విస్తరణకు ప్రయత్నాలు మొదలుపెట్టాయి. ఇక ఆదిబట్లలో ఏరోసిటీలో టాటా ఏరో స్పేస్ ఆరు విభాగాల్లో తమ ఉత్పత్తులను మొదలు పెడుతోంది. ఇందుకోసం రూ.1,200 కోట్లు పెట్టుబడులు పెట్టింది. దీంతోపాటు ఈ కామర్స్ దిగ్గజం అమెజాన్ తన సేవలను మొదలుపెట్టింది. వీటికంటే ముందు జిల్లాలో ఐటీ కారిడార్, హార్డ్‌వేర్ పార్క్‌లు, ఐడీఏ కాటేదాన్ , ఐడీఏ కొత్తూరు తదితర సెజ్‌లు, పార్క్‌లు కూడా విస్తరించడం తో పారిశ్రామికరంగంలో జిల్లా దూసుకెళ్తోంది. సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయడంతోనే ఉత్తమ ప్రతిభ చూపేందుకు సాధ్యమైందని పేర్కొన్నారు. పరిశ్రమల స్థాపనకు జిల్లా అన్ని విధాల అనుకూలమని జిల్లా పరిశ్రమల అధికారులు చెప్పారు.

## ముషారఫ్‌కు మరణశిక్షపై స్పందన కరవు

### పాక్ ప్రజల్లో పెద్దగా చర్చకు రాని అంశం

ఇస్లామాబాద్,డిసెంబర్18(ఆర్ఎన్ఎ): పాకిస్తాన్ మాజీ సైనిక పాలకుడు పర్వేజ్ ముషరఫ్‌కు పాకిస్తానీ కోర్టు మరణ శిక్ష విధించినందుకు పాక్ ప్రజల్లో పెద్దగా చింత కానరావడంలేదు.

అలాగే దీనిపై పెద్దగా చర్చ కూడా జరగడంలేదు. ఎందు కంటే అక్కడ పాలకులకు ఇలాంటి శిక్షలు మామూలే అన్న ధోరణి కనిపిస్తోంది. సైనిక పాలన కింద ఎక్కువగా మగ్గిన దేశంలో ఒక మాజీ సైనిక పాలకుడికి మరణశిక్ష విధించటం పాక్ చరిత్రలో ఇదే తొలిసారి అయినా, పెద్దగా నిరసనలు లేదా,హర్షా వోదాలు లభించలేదు. అత్యవసర పరిస్థితి ప్రకటించి, రాజ్యాంగాన్ని సస్పెండ్ చేయటం ద్వారా ముషరఫ్ దేశద్రోహానికి పాల్పడ్డారంటూ ఆయనపై 2012లో అందిన ఫిర్యాదు మేరకు సుప్రీంకోర్టు 2014లో విచారణ చేపట్టింది. పాకిస్తాన్ రాజ్యాంగంలోని ఆర్టికల్ 6ను ఉల్లంఘించిన నేరానికి మాజీ అధ్యక్షుడు పర్వేజ్ ముషరఫ్ దోషిగా నిరూపిత మయ్యారని ప్రభుత్వ న్యాయవాది సల్మాన్ నదీమ్ మీడియాకు వివరించారు. అనారోగ్యం పేరుతో 2016లో దుబారుకి వెళ్లి ప్రవాసజీవితం గడుపుతున్న ముషరఫ్ కోర్టు తీర్పుపై వెంటనే స్పందించలేదు. అయితే తనపై నమోదయిన అభియోగాలను ఆయన పలుమార్లు తిరస్కరించిన విషయం తెలిసిందే.

1999లో సైనిక కుట్ర ద్వారా అధికార పగ్గాలను చేపట్టిన ముషరఫ్ దేశాన్ని తొమ్మిదేళ్లు పరిపాలించారు. అనంతరం 2008లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఆయన పార్టీ ఓటమి పాలు కావటంతో అధికారాన్ని కోల్పోయారు. 2007లో దేశాధ్యక్షుడిగా వున్న సమయంలో దేశంలో అత్యవసర పరిస్థితి విధించి రాజ్యాంగాన్ని సస్పెండ్ చేయటమే కాక సీనియర్ రాజకీయ నేతలు, న్యాయమూ ర్తులను నిర్బంధించారు. ఎమర్జెన్సీలో భాగంగానే అప్పటి ప్రధాన న్యాయమూర్తి ఇఫ్తికర్ మహ్మద్ చౌదరిని తొలగించేందుకు ముషరఫ్ చేసిన ప్రయత్నాలను సుప్రీంకోర్టు చట్టవిరుద్ధంగా ప్రకటించింది.




ఈనెల 14న యం. బాల గంగాధరయ్య రచించిన ‘కలల సౌధాలలో’ కథల సంపుటి ఆవిష్కరణ సభలో పెద్దూరి వెంకటదాసు నేతృత్వంలో జరిగిన కవితా గానంలో పాల్గొన్న కవులు, కవయిత్రులు.



పురస్కార గ్రహీతలతో డా॥ కె.వి. రమణాచారి.

తెలంగాణ ప్రాంతానికి చెందిన పలువురు జానపద కళాకారులను ఘనంగా సత్కరించి నగదు పురస్కారాలు ప్రదానం చేశారు. రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో సారిపల్లి కొండలరావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం నిర్వహించిన పురస్కార ప్రదానోత్సవ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు డా॥కె.వి. రమణాచారి ముఖ్య అతిథిగా పాల్గొని కళాకారులను సత్కరించి నగదు పురస్కారాలు అందించారు. తెలంగాణ జానపద కళాకారుల సంఘం అధ్యక్ష కార్యదర్శులు వంగా శ్రీనివాస్‌గౌడ్, నుంచులింగయ్యతో పాటు వేకల నారాయణ, స్నేహలత మురళి తదితరులు పాల్గొన్నారు.

పురస్కార గ్రహీతలు: పి. శకుంతల (జానపదం), జి. కొమురయ్య (కోలాటం), బి. నర్సయ్య (పౌడపత్రపు కథ), టి. కృష్ణమూర్తి, (బుర్రకథ), టి. నాగేశమ్మ (బతుకమ్మ కోలాటం), సి. లక్ష్మయ్య (వీధి భాగవతం), డి. వీరకోటి (పిట్టలదొర), జి. నర్సయ్య (యక్షగానం), సి.హెచ్. భూమయ్య (వీధి నాటకం)లు పురస్కారాలు స్వీకరించారు.

## సాహితీ గౌతమి-కరీంనగర్ 30వ సినారె కవితా పురస్కార ప్రదానోత్సవం



ప్రముఖ కవి మునాసు వెంకట్ దంపతులకు సినారె పురస్కారం అందజేస్తున్న అతిథులు

కవిత్వం సార్వజనీనమైనదని, సమాజాన్ని సంస్కరించగల శక్తి కవిత్వానికుందని జిల్లా సంయుక్త పాలనాధికారి జి.వి. శ్యాంప్రసాద్‌లాల్ పేర్కొన్నారు. సాహితీ గౌతమి సోమవారం కరీంనగర్‌లో ఐఎంఏ సమావేశ మందిరంలో జరిగిన 30వ సినారె కవితా పురస్కార ప్రదానోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ‘మెద’ కవితా సంపుటిని రచించిన ప్రముఖ కవి మునాసు వెంకట్‌కు ఆయన సినారె కవితా పురస్కారాన్ని ప్రదానం చేశారు. పురస్కార గ్రహీతను సత్కరించి, జ్ఞాపికను అందించారు. హృదయ పరివర్తనకు మూలభూతంగా నిలువదగిన గొప్ప కవిత్వాన్ని మునాసు వెంకట్ రచించారని ఆయన కొనియాడారు. మునాసు వెంకట్ కవిత్వంలో ఒక మానసిక వికాస నిపుణత కనిపిస్తున్నదని అభిప్రాయపడ్డారు. సామాజిక సమస్యల్ని ప్రభావవంతమైన భావనా పటిమతో, తెలంగాణ ప్రాంతీయ భాషా సొగసులతో కవిత్వ రచన చేయడం మునాసు వెంకట్ శిల్పంలో గోచరిస్తుందన్నారు. ఆర్ద్రతతో కూడిన తెలంగాణ అస్తిత్వం కవితల్లో పుష్కలంగా కనిపిస్తున్నదని చెప్పారు. మార్పును కవిత్వీకరించి సమాజ ద్వారాలను తెరిచేవాడే నిజమైన కవి అని స్పష్టం చేసారు. ఇటువంటి కవిత్వమే ఏ కాలపు సమాజానికైనా ఆవశ్యకమని అన్నారు. సభాధ్యక్షులు, పురస్కార ప్రదాత, సినారె కవితా పురస్కార కమిటీ కన్వీనర్ డా॥ ఎడవెల్లి విజయేంద్రరెడ్డి మాట్లాడుతూ సాహితీ గౌతమి గత 30 సంవత్సరాలుగా ఈ పురస్కారాన్ని నిరంతరాయంగా అందిస్తుందని, సంస్థ అంకిత భావాన్ని ప్రశంసించారు. సాహితీ గౌతమి అధ్యక్షుడు డా॥ గండ్ర లక్ష్మణరావు మాట్లాడుతూ తెలంగాణ ఆత్మను ‘మెద’ కవితా సంపుటిలో ఆవిష్కరించారన్నారు. ‘మెద’ కవిత్వ సంపుటిలోని కవితాత్మను కె.ఎస్. అనంతాచార్య ఆవిష్కరించారు. సాహితీ గౌతమి ప్రధాన కార్యదర్శి గాజుల రవీందర్ నివేదిక అందించారు. ఈ కార్యక్రమంలో దాస్యం సేనాధిపతి, మాడిశెట్టి గోపాల్, స్తంభంకాడి గంగాధర్, ఇస్రత్ సుల్తానా, బి.ఎన్.ఆర్.శర్మ, గంగుల శ్రీకర్, వేణుశ్రీ, మచ్చ హరిదాసు, కలువకుంట రామకృష్ణ, గంప ఉమాపతి, జి.వి. కృష్ణమూర్తి, అనుముల దయాకర్, తత్వాది ప్రమోద్‌కుమార్, నంది శ్రీనివాస్, కూకట్ల తిరుపతి, బొమ్మకంటి కిషన్, గుర్రాల మాధవ్, శంకర్ ప్రసాద్, శ్రీలత, మంగ తదితరులు పాల్గొన్నారు.




## అస్థిత్వ మూలాలవైపు కవిత్వ రచన సాగాలి -డా.ఏనుగు నరసింహారెడ్డి



ఉదయసాహితి కరీంనగర్ ఆధ్వర్యంలో స్థానిక వాగేశ్వరి డిగ్రీ కళాశాలనందు తేది 15-12-2019 ఆదివారంనాడు జయపాల్ రెడ్డి కవిత్వం"మలయసమీరం" పుస్తకావిష్కరణ కార్యక్రమమునకు ముఖ్య అతిథిగా విచ్చేసి పుస్తకాన్ని ఆవిష్కరించిన తెలంగాణ సాహిత్య అకాడమీ ప్రధాన కార్యదర్శి శ్రీ డా.ఏనుగు నరసింహారెడ్డి గారు మాట్లాడుతూ తెలంగాణ అస్థిత్వ మూలాలవైపు నేటి కవుల రచనలు సాగుతున్న తరుణంలో వెల్మల జయపాల్ రెడ్డి కవిత్వం వెలువరించడం శుభపరిణామమని,మలయసమీరం తొలి గ్రంథమైన తన కవిత్వంలో భావ గంభీరత,అర్ధగౌరవం ఉన్నాయని వారు పేర్కొన్నారు. సభలో అమ్మకు నమస్కరించి తన తొలి పుస్తకాన్ని వెల్మల జయపాల్ రెడ్డి అందించడం అభినందనీయమని అన్నారు

కవిత్వానికి సామాజిక ప్రయోజనం ఉండాలని అప్పుడే ఆ కవిత్వానికి శాశ్వతత్వం ఉంటుందని ఆ దిశగా నూతనంగా రాస్తున్న కవులు కృషిచేయాలని వారు సూచించారు. పుస్తక పరిచయం చేసిన అన్నాడి గజేందర్ రెడ్డి గారు మాట్లాడుతూ"జయపాల్ రెడ్డి కవిత్వం భావ కవిత విన్యాసంతో సాగిందని చక్కని దేశభక్తి గేయాలతో చిక్కని కవిత్వంతో కొనసాగిందని" పేర్కొన్నారు.

సభాధ్యక్షులు డా.వైరాగ్యం ప్రభాకర్ మాట్లాడుతూ ఉదయ సాహితీ ద్వారా నూతన కవిత,కథా సంకలనాలను వెలికి తీసుకు వస్తున్నామని ఉభయ తెలుగు రాష్ట్రాల లో ఉదయ సాహితీ గొప్ప కృషి చేస్తుందని వారు పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో విశిష్ట అతిథులు స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ శ్రీ ధవళాపురం శ్రీనివాస్ రెడ్డిగారు జయపాల్ రెడ్డి కవిత్వంలో లయ ఉందన్నారు. ప్రముఖ కవి రచయిత విమర్శకులు శ్రీ దాస్యం సేనాధిపతి గారు మాట్లాడుతూ జయపాల్ రెడ్డి కవిత్వం నిండా భావుకతా పరిమళాలు గుబాళిస్తున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో వెల్మల జయపాల్ రెడ్డి తన తొలి కవితా సంకలనాన్ని వారి మాతృమూర్తికి అంకితమిచ్చి తమ ప్రేమను చాటుకున్నారు.

ఉదయ సాహితీ అధ్యక్షులు డాక్టర్ వైరాగ్యం ప్రభాకర్ అధ్యక్షత వహించిన కార్యక్రమంలో సాహితీ గౌతమి కార్యదర్శి గాజుల రవీందర్, శ్రీ దాస్యం లక్ష్మయ్య కళ్యాణం శ్రీనివాస్ నుజెట్టి రవీంద్రనాథ్ ఉషశ్రీ వెగ్గళం ఇతరులు మాట్లాడారు.

ఈ కార్యక్రమంలో డాక్టర్ గండ్ర లక్ష్మణరావు డాక్టర్ బి వి ఎన్ స్వామి కూకట్ల తిరుపతి గంగుల శ్రీకర్ అన్నవరం దేవేందర్ నవనీత రావు లక్ష్మీనారాయణ ,మధు శ్రీ బాల్ రెడ్డి, గజ్జెల నల్లగొండయ్య, శ్రవణ్ కుమార్, తడిగొప్పుల కుమారస్వామి, పెనుగొండ బసవేశ్వర్ గోవర్ధన ఆచార్య ప్రద్యుమ్న, కొత్త అనిల్ కుమార్,శంకర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## సాహితీ సేవా తత్పరులు “డా॥ వాసా ప్రభావతి” ఇక లేరు..



ఒక సభలో ప్రసంగిస్తున్న డా॥ వాసా ప్రభావతి. వేదికపై డా॥కె.వి. రమణాచారి, కె.విశ్వనాథ్ తదితరులు.

హైదరాబాద్, డిసెంబర్ 18 (నేటి నిజం ప్రత్యేక ప్రతినిధి):ప్రముఖ రచయిత్రి డా॥ వాసా ప్రభావతి (80) తీవ్ర అనారోగ్యంతో ఈ రోజు ఉదయం కన్ను మూశారు.

“నన్ను నలుపని ఋతువులన్నీ/ నిరసించాయి/ నా గొంతు విని నన్ను ఆస్థాన కవిని / చేసుకుంది వసంతం” అంటూ చిన్నతనంలోనే తనను నలుపని అందరూ అంటుంటే రచించిన కవితని డా॥ వాసాప్రభావతి గారిని తలుచుకున్నప్పుడల్లా గుర్తుకు వస్తుంది. అమ్మ లక్ష్మీ సోమిదేవమ్మ, తండ్రి కాశీచయనుల సూర్యనారాయణ. తండ్రి ప్రోత్సాహంవల్లే వీరికి చదువుమీద అంత ఆసక్తి కలిగింది అనేవారు. తండ్రిని చూస్తూ తాను కూడా తండ్రిలా జీవించాలను కునేవారట. అందుకే ఆడపిల్లకు చదువు అందుకు అనే రోజుల్లోనే పిహెచ్‌డి పట్టాను పొందారు. వనితా విశ్వవిద్యాలయంలో తెలుగు అధ్యాపకులుగా పనిచేసి పదవీ విరమణ పొందారు. డా॥ వాసా ప్రభావతి గారు మంచి కవయిత్రి. రచయిత్రి. చిన్నతనం నుంచి చదువుకోవాలని, తాను ఉన్నత స్థానంలో ఉండాలని అనుకునేవారట. సాహితీ వ్యాసాలతో వీరి రచనా వ్యాసంగం మొదలై వీరు ఎన్నో కథలు, నవలలు, కవితలు రచించారు. 1978లో “ఆలాపన” మొదటి కవితా సంపుటి తో మొదలైన వీరి సాహితీ ప్రయాణం తరువాత ‘అమ్మ’ , జగతి ప్రగతి(కావ్యం), హృదయనేత్రి, మంజీర నాదాలు, మళ్ళీ మళ్ళీ పుడతా” అలలకొలువు (మినీ కవిత్వం), సుమారు వందకు పైగా కథలు, రైల్లో సుందరి, అంగడి వినోదం, మొసలి, గద్ద, పడగ విప్పిన నేలతల్లి, పట్టుదల ఉంటే మొదలైన కథలతో ప్రభావతి గారు ప్రజల మన్ననలు ఎంతగానో పొందారు.



అనంతరం వెండివెలుగులు (కృష్ణపత్రిక సీరియల్), ప్రేమబంధం, సీతాలక్ష్మి, ఆకాశదీపం నవలలు రచించారు. ఆకాశవాణి ద్వారా “బిక్షుకి” (నాటిక), దువ్వూరి సుబ్బమ్మ ఉద్యమ చరిత్ర ఆధారంగా ‘దేశబాంధవి’ నాటిక, కోడళ్ళొస్తున్నారు జాగ్రత్త, స్నేహ యాత్ర వంటి నాటికలు రచించి, ఆచార్య సి.నారాయణ రెడ్డి గారు, బోయభీమన్న వంటి మహాకవుల అభినందనలకు నోచుకున్నారు. ఇంతే కాకుండా స్వాతంత్ర్య స్వర్ణోత్స వాల సందర్భంగా “స్వాతంత్రోద్యమంలో తెలుగు మహిళలు” అనే గ్రంథం రచించారు.. ఇవి కాక అనేక పాటలు టీవి ద్వారా, ఆకాశవాణి ద్వారా ప్రసారం అయ్యాయి. ఇంకా అవుతూనే ఉన్నాయి. వీరి రచనలకు ఎన్నో పురస్కారాలు వచ్చాయి. ఇల్లంతా పురస్కారాల సందడే అంటే అతిశయోక్తి కాదు. తెలుగు విశ్వవిద్యాలయం వారు ఇచ్చిన ఉత్తమ రచయిత్రి పురస్కారం, ఎండోమెంట్ వారిచే ఉత్తమ రచయిత్రి అవార్డు, సుశీలా నారాయణ రెడ్డి అవార్డు, గృహలక్ష్మి కంకణం, వంటి ప్రతిష్టాత్మకమైన అవార్డులు అనేకం అందుకున్నారు. సాహితీ శిరోమణి, అక్షర కంఠీరవ వంటి బిరుదులు సొంతం చేసుకున్నారు.

ఇవన్నీ ఒక ఎత్తైతే ‘సఖ్యసాహితి’ అనే మహిళల సంస్థ తర్వాత మహిళల కోసం ప్రత్యేకంగా ‘లేఖినీ మహిళా చైతన్య సాహితీ సంస్థ’ ద్వారా సాహితీ సేవను చేసారు. ఎందరో వర్ధమాన కవయిత్రులకు మార్గదర్శకం చేసారు. వారి రచనలను ప్రోత్సహిస్తూ ప్రతి ఏడాది ‘మాతృదేవోభవ’ అనే పేరుతో పురస్కారాలు అందించేవారు. పోటీలు నిర్వహిస్తూ ఎందరో రచయిత్రులను ఉత్సాహపరి చేవారు. ఉన్నదున్నట్లు మాట్లాడటం, కఠినంగా వివరణ ఇవ్వడం ద్వారా వీరు అందరికీ ఇంటి పెద్దగానే నిలిచిపోయారు.వీరు లేని లోటు తెలుగు సాహిత్యంలో అనేకమంది రచయిత్రులను తీవ్రంగా బాధిస్తోంది. అయినా ఎక్కడికి కెళతారు? ఎంత దూరమని వెళతారు? తెలుగు సాహిత్యం వీరికి అక్కున చేర్చుకున్నాక.. వీరి కుటుంబ సభ్యులకు “నేటినిజం' పత్రిక ప్రగాఢ సంతాపం తెలియజేస్తోంది.


Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas, Ph.No.040- 2766 2477.
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com.